RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త


తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 317 గురువారం 11 డిసెంబర్ 2025 పేజీలు : 4 వెల : రూ. 2.00

## ఉగ్రవాద నిర్మూలనలో భారత్ నిబద్ధతను ప్రపంచానికి చాటాం

న్యూఢిల్లీ : ఉగ్రవాదాన్ని నిర్మూలించడం.. శాంతి స్థాపనలో భారత్ నిబద్ధతను ప్రపంచానికి చాటామని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్', పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదంపై ఐరోపా సమాఖ్య, 33 దేశాలకు వివరించేందుకు సిటింగ్ ఎంపీల నేతృత్వంలో ఏడు అఖిలపక్ష బృందాలు పర్యటించిన విషయం తెలిసిందే..! భారత్ తిరిగి వచ్చిన ఈ బృందాలతో ప్రధాని భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. భారత గొంతుకను ప్రపంచ దేశాలకు చాటిన బృందాల పనితీరుకు గర్విస్తున్నానని వ్యాఖ్యానించారు. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ వైఖరిని తెలియజేయడంలో ఈ బృందాల ప్రయత్నాలను ప్రశంసించారు.




# ఓయూకు అంతర్జాతీయ గుర్తింపు తెస్తా!

## ఉత్తుత్తి మాటలు చెప్పను.. చీడ పడితే ఏ మందు కొట్టాలో నాకు తెలుసు

## ఉస్మానియా యూనివర్శిటీని సందర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: గుండెల నిండా అభిమానం నింపుకొని ఓయూకు వచ్చానని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఉస్మానియా యూనివర్సిటీని సందర్శించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందరరేగా ఓయూ అభివృద్ధికి వెయ్యి కోట్ల రూపాయలు ప్రకటించారు. "ఈ విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దాలనే సంకల్పంతో వచ్చా. ఆధిపత్యానికి వ్యతిరేకంగా తెలంగాణలో అనేక పోరాటాలు వచ్చాయి. నిజాం, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం జరిగింది. సామాన్యులైన చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య.. దొరలపై పోరాడారు. ఉమ్మడి రాష్ట్రంలో న్యాయం జరగలేదని తెలంగాణ ఉద్యమం వచ్చింది.

ఉద్యమాన్ని ఉస్మానియా నుంచే విద్యార్థులు ప్రారంభించారు. గతంలో ఈ వేదిక నుంచే స్వరాష్ట్ర ఆకాంక్షను విద్యార్థులు బలంగా వినిపించారు. పోరాడి సాధించిన రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలు నెరవేరాయా? లేదా? అని ఇక్కడే తెలుసుకోవాలని అనుకున్నాను. ఓయూకి వెళ్లే ధైర్యం ఎందుకు చేస్తున్నారని గతంలో నన్ను చాలా మంది అడిగారు. నాది ధైర్యం కాదు.. అభిమానం. మన భవిష్యత్తు ప్రణాళికలు రాసుకునేందుకు ఇక్కడికి వచ్చాను. ఓయూను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చదిద్దాలనేది నా సంకల్పం.

**ఎంతోమంది ప్రముఖులను ఓయూ అందించింది...** తెలంగాణ ప్రాంతానికి ఒక చైతన్యం, పౌరుషం ఉంది. ఎందరో ఓయూ విద్యార్థులు రాష్ట్రం కోసం ఆయుధాలతో అడవిబాట పట్టారు. గద్దర్, జార్జిరెడ్డి, పీవీ నరసింహారావు వంటి ఎంతోమంది ప్రముఖులను ఈ యూనివర్సిటీ ఇచ్చింది. బడికి వెళ్లని ఓ పేదింటి బిడ్డ అందెశ్రీ.. జయజయహే తెలంగాణ నినాదాన్ని అందించారు. సమాజానికి ఏ సమస్య వచ్చినా ఈ యూనివర్సిటీ విద్యార్థులు కదం తొక్కారు. రాష్ట్రం ఏర్పడ్డాక ఎవరి ఆస్తిలో వాటా అడగలేదు.. కేవలం స్వేఛ్ఛ, సమాన అవకాశాలు మాత్రమే అడిగారు. మీరు ఎదిగేందుకు ఈ ప్రభుత్వం స్వేఛ్ఛను ఇస్తుంది. ప్రపంచానికే మీరు దిక్సూచిగా మారాలి. ఎవరి గురించీ రాజకీయ వ్యాఖ్యలు చేయాలనుకోవడం లేదు. కొందరు రెండేళ్లుగా మాట్లాడుతున్నారు. నేను గుంటూరులో చదువుకోలేదు.. గూడుపుఠాణీలు చేయలేను. గుంటూరులో చదువుకున్న వాళ్లు బెంజ్ కారులో వెళ్లి పేదరికం గురించి తెలుసుకుంటారు. గుంటూరు, పుణె, అమెరికాలో చదువుకున్నాం అని ఉపన్యాసాలు ఇవ్వడం ద్వారా ఏం చెప్పాలని అనుకుంటున్నారు?

**విద్య మాత్రమే ఆత్మగౌరవాన్ని పెంచుతుంది...** నాకు భాష సరిగా రాకపోవచ్చు.. కానీ పేదవాడిని అర్థం చేసుకునే భాష వచ్చు. పేదవాడి బిడ్డ చదువుకుంటే ఎలాంటి ప్రయోజనం ఉంటుందో నాకు తెలుసు. పేదలు, నిస్సహాయులకు అండగా ఉండేలా చర్యలు చేపడుతున్నాం. నేను ఫాంహౌస్‌లు కట్టించుకోలేదు.. సాధారణంగానే ఉన్నా. రాష్ట్ర ముఖ్యమంత్రిగా, మీ సోదరుడిగా ఈ ఆర్ట్స్ కాలేజీ ముందు నిలుచున్నా. చరిత్రలో సజీవంగా నిలబడే కార్యక్రమాలు చేయాలని అనుకుంటున్నా. జయజయహే తెలంగాణ గీతం, తెలంగాణ తల్లిని ఆవిష్కరించుకున్నాం. వర్గీకరణ ద్వారా దళితుల సమస్యను శాశ్వతంగా పరిష్కరించాం. జనగణనలో కులగణన చేపట్టి వందేళ్ల సమస్యను పరిష్కరించాం. ప్రభుత్వం దగ్గర పంచేందుకు డబ్బు లేదు. దళితులకు మూడెకరాల భూమి ఇస్తామన్నారు.. గత పదేళ్లలో ఎవరికైనా ఇచ్చారా? భూములు ఉన్న ఆసాములు కూడా వెనుకబాటుతనంతో బాధపడుతున్నారు. దాన్ని నిర్మూలించాలంటే ప్రతి గ్రామంలో విద్యావకాశాలు పెంచాలి. నాణ్యమైన విద్య, స్కిల్స్‌ను అందించేందుకు కృషి చేస్తున్నాం. విద్య ఒక్కటే మన ఆత్మగౌరవాన్ని పెంచుతుంది.

**చైనాకు కూడా ఇంగ్లిష్ రాదు.. కానీ..** విద్యాలయాల్లో కుల వివక్ష ఉండకూడదనే యంగ్ ఇండియా స్కూల్స్‌లో అందరూ కలిసి చదువుకునేలా చర్యలు చేపట్టాం. డబ్బు ఉన్నవాళ్లు ఎక్కడికి వెళ్లి అయినా చదువుకోగలరు. పేదింటి విద్యార్థులకు ఉస్మానియా యూనివర్సిటీ నాణ్యమైన విద్యను అందించాలి. మంజూరు చేసిన రూ.1000 కోట్లు డబ్బుగా కాదు.. భవిష్యత్తు తరాలకు పెట్టుబడిగా చూస్తున్నాం. ఉత్తుత్తి మాటలు చెప్పను.. మన చేనుకి చీడ పడితే ఏ మందు కొట్టాలో నాకు తెలుసు. నాకు ఇంగ్లిష్ రాదని వాళ్లు అనుకుంటున్నారు. చైనాకు కూడా ఆ భాష రాదు.. కానీ ఆ దేశం ప్రొడక్షన్ నిలిపివేస్తే అమెరికా కూడా విలవిలలాడుతుంది. భాష కేవలం కమ్యూనికేషన్ కోసం మాత్రమే.. అది నాలెడ్జ్ కాదు. రాష్ట్రానికి ఓయూ గుండెకాయ లాంటిది. సమస్యల మీద కొట్లాడతానంటే నేను వద్దు అనను. రాజకీయ పార్టీల మోచేతినీళ్లు తాగాలని.. వాళ్ల జెండాలు మోయాలని అనుకోవద్దు. మీ స్వతంత్రతను నిలబెట్టుకోండి" అని రేవంత్ అన్నారు.

**ఓయూకు రూ.వెయ్యికోట్లు.. ఉత్తర్వులు జారీ...** ఉస్మానియా యూనివర్సిటీకి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. రూ.వెయ్యి కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రూ.వెయ్యికోట్ల నిధుల విడుదల జీవోను విద్యార్థులకు అంకితం చేస్తున్నట్లు సీఎం పేర్కొన్నారు.

## ఎన్నికలు ఎప్పుడు వస్తాయని ప్రజలు ఎదురు చూస్తున్నారు



సిరిసిల్ల : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను మళ్లీ సీఎం చేయాలని ప్రజలు కోరుకుంటున్నారని.. అందుకోసం అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు వస్తాయా? అని వారు ఎదురు చూస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. బుధవారం సిరిసిల్లలో కేటీఆర్ పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా ఆటో డ్రైవర్లకు ఆత్మీయ భరోసా కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొ న్నారు. ఈ సందరరేగా కేటీఆర్ మాట్లాడుతూ.. దేవుళ్ళ మీద ఒట్టేసి మరీ సీఎం రేవంత్ మోసం చేశాడని మండిప డ్డారు. రూ. 2 లక్షల రుణ మాఫీ కావాలంటే రూ. 50 వేల కోట్లు కావాల్సి ఉంటుందన్నారు. రూ. 12 వేల కోట్లతో కేవలం 25 శాతం మందికి మాత్రమే రుణ మాఫీ చేశారని గుర్తు చేశారు. ఎన్నికల సమయం లో ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాలు ఏమైనాయి సీఎం రేవంత్ రెడ్డి అంటూ కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. తాము ఇచ్చిన ఉద్యోగాలను నువ్వు ఇచ్చినట్లు చెప్పుకుంటావా? అని సీఎం రేవంత్ రెడ్డిపై ఈ సందరరేగా కేటీఆర్ నిలదీశారు. అధికారంలోకి వచ్చి.. రెండేళ్లు అయినా ఇంకా అబద్దాలే చెబుతావా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 420 హామీలు ఇచ్చి.. ఒక్కటీ అమలు చేయలేదని సీఎం రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. ఈ పర్యటనలో ఇన్సురెన్స్ బాండ్లను కేటీఆర్ పంపిణీ చేశారు. 2023 ఏడాది చివరల్లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఓటరు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాడు. దీంతో రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం కొలువు తీరింది. ఇక పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ఈ ఎన్నికల ఫలితాలతో ప్రతిపక్షానికి పరిమితమైంది. ఎన్నికల సమయం లో ప్రజలకు కాంగ్రెస్ పార్టీ పలు హామీలు ఇచ్చింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు అయినా.. ఇంకా అమలు చేయడం లేదంటూ ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ వరుసగా విమర్శలు గుప్పిస్తున్న సంగతి తెలిసిందే.




హైదరాబాద్, డిసెంబర్ 10: తెలంగాణలో తొలి దశ గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ గురువారం జరగనున్నాయని.. ఈ నేపథ్యంలో అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఓటర్లకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) రాణి కుముదిని సూచించారు. గురువారం హైదరాబాద్‌లో ఎస్ఈసీ రాణి కుముదిని విలేకర్లతో మాట్లాడుతూ.. తొలి దశ పల్లె పోరుకు సర్వం సిద్ధం చేసినట్లు తెలిపారు. గురువారం ఉదయం 7.00 గంటల నుంచి ఈ పోలింగ్ ప్రారంభమవుతుందన్నారు. ఈ తొలి దశలో 56,19,430 మంది ఓటర్లు.. తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని చెప్పారు. అబ్జర్వర్లు, మైక్రో అబ్జర్వర్లతో ఈ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద సీసీ కెమెరా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ ఎన్నికల విధుల్లో లక్ష మందికి పైగా సిబ్బంది పాల్గొనున్నారని వివరించారు. ఈ ఎన్నికల్లో ఓటర్లు 18 రకాల ఐడి కార్డులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఏ రకమైన ఐడి కార్డును పోలింగ్ బూత్ అధికారులకు చూపించిన ఓటు వేయవచ్చునన్నారు. ఇక మంగవారం నుంచి ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో వైన్ షాపులన్నీ మూసి వేసినట్లు చెప్పారు. అన్ని జిల్లాల కలెక్టర్లకు మేజిస్ట్రియల్ పవర్స్ ఇస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్ఈసీ వివరించారు.

**రూ. 8 కోట్లు సీజ్: లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీ...** పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తర్వాత ఇప్పటి వరకు రూ. 8 కోట్ల నగదు సీజ్ చేశామని లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ వెల్లడించారు. రూ. రెండున్నర కోట్ల విలువైన డ్రగ్స్, రూ. 2 కోట్ల క్యాష్, రూ. 3 కోట్ల విలువైన మద్యం సీజ్ చేశామన్నారు. 3,214 మందిపై ఎఫ్ఐఆర్, 31,428 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు వివరించారు. కొంత మంది వద్ద నుంచి ముందస్తు చర్యల్లో భాగంగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. తొలి విడత ఎన్నికల ప్రచారానికి మంగళవారం సాయంత్రంతో తెర పడింది. ఈ తొలి విడత ఎన్నికల్లో మొత్తం 4,236 గ్రామ పంచాయతీలకు నోటిఫికేషన్ వెలువడింది. వాటిలో 5 చోట్ల అసలు నామినేషన్లు దాఖలు కాలేదు. మరో 395 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. వీటి మినహా మిగిలిన 3836 సర్పంచ్ స్థానాలకు రేపు అంటే గురువారం ఎన్నికలు జరగనున్నాయి. ఈ తొలి విడత పోరులో మొత్తం 13,127 మంది సర్పంచ్ అభ్యర్థులు బరిలో నిలిచారు. ఈ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం రూ. 175 కోట్ల నిధులను రేవంత్ ప్రభుత్వం కేటాయించిన సంగతి తెలిసిందే. అందులో రూ. 100 కోట్ల నిధులను ఇప్పటికే సర్కార్ విడుదల చేసింది. తెలంగాణలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికలు మొత్తం మూడు దశల్లో జరుగుతున్నాయి. తొలి దశ రేపు అంటే డిసెంబర్ 11న జరుగుతుండగా.. రెండో దశ డిసెంబర్ 14న, మూడో దశ డిసెంబర్ 17వ తేదీన పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి.



## ట్రంప్ కూడా ఆపలేని ఏకైక యుద్ధం ఇదే కావచ్చు..

## యుద్ధ విన్యాసాలకు భారత్ సిద్ధమవుతోందా?

# ఈసారి పాకిస్తాన్ ఖతం...

## త్రివిధ దళాల ఏకకాల దాడులా?

## గ్రద్దలా కాచుకుని ఉన్న ఆఫ్ఘనిస్తాన్.. భయంతో వణికిపోతున్న పాకిస్తాన్..!

భారత సైన్యం, వైమానిక దళం మరియు నౌకాదళం వంటి త్రివిధ దళాలసంయుక్త విన్యాసాలు ఇటీవల కాలంలో, పాకిస్తాన్‌ను లక్ష్యంగా చేసుకుని స్పష్టమైన 'బహుళ-రంగ యుద్ధం' రిహార్సల్ గా పరిగణించబడుతున్నాయి. ముఖ్యంగా, గుజరాత్ నుండి ఉత్తర సరిహద్దుల వరకు జరిగిన తీవ్రమైన శిక్షణ, భారతదేశం యొక్క యుద్ధ సన్నద్ధత మరియు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగాన్ని ప్రకటిస్తున్నాయి. ఇటీవలి విన్యాసాలలో, వైమానిక దాడుల నుండి ముఖ్య స్థావరాలను రక్షించడానికి ఉపయోగపడే 'రాపిడ్ వాల్ ప్యానెల్స్'వంటి త్వరిత మౌలిక సదుపాయాలసాంకేతికతను సైన్యం మొదటిసారిగా పరీక్షించింది. ఈ విన్యాసాల ద్వారా, యుద్ధ వాతావరణంలో చాలా తక్కువ సమయంలోవిమాన స్థావరాలు, క్షిపణి స్థావరాలు లేదా ముఖ్యమైన ప్రాంతాలను దాడి నుండి రక్షించేసామగ్రి సామర్థ్యాన్ని భారతదేశం ధృవీకరించింది. ఉత్తర ప్రాంతంలో, భారత సైన్యం యొక్క ఉత్తర కమాండ్ ఆధ్వర్యంలో త్రివిధ దళాల సంయుక్త యుద్ధ విన్యాసం చాలా తీవ్రంగా జరిగింది. భారతదేశం బహుళ రంగాలలో పోరాడే సామర్థ్యాన్ని పరీక్షించింది. ఇందులో డ్రోన్‌లు, మానవరహిత వైమానిక వాహనాలు, ఖచ్చితమైన దాడి ఆయుధాలు మరియు హెలికాప్టర్ల ద్వారా డ్రోన్-ఆధారిత ఆయుధ వ్యవస్థలను సమ యం చేసి నిర్వహించడం వంటివి ఉన్నాయి. గాలి నుండి వచ్చే ముప్పులు, భూమిపై ఉన్న లక్ష్యాలు, సముద్రం కింద ఉన్న లక్ష్యాలు వంటి త్రిమితీయ ముప్పులనుఒకేసారి ఎదుర్కోవడం గురించి శిక్షణ నిర్వహించబడింది. S-400 క్షిపణి వ్యవస్థల వంటి ముఖ్యమైన క్షిపణి నిరోధక వ్యవస్థల ద్వారా ముఖ్యమైన మౌలిక సదుపాయాలను రక్షించే రిహార్సల్ కూడా నిర్వహించబడింది. ఈ విన్యాసాల ముఖ్య ఉద్దేశంయుద్ధ రంగంలోఆయుధాల పనితీరు సామర్థ్యాన్ని ధృవీకరించడం. త్రివిధ దళాల ఈ విన్యాసం అత్యాధునిక నెట్‌వర్క్-కేంద్రీకృత యుద్ధ విధానంపై ఆధారపడింది. అన్ని సైనిక కమాండర్‌లు, పోరాట యోధులు మరియు వాయు రక్షణ వ్యవస్థలు ఒక సాధారణ కంప్యూటర్ నెట్‌వర్క్ కింద అనుసంధానం చేయబడి, గరిష్ట వేగం మరియు ఖచ్చితత్వంతోనిర్ణయాలు తీసుకోవడానికి శిక్షణ పొందారు. దీని ద్వారా, లక్ష్యాలను గుర్తించడం నుండి దాడి చేయడం వరకు ప్రక్రియ యొక్క విజయ శాతం యొక్క నిజాయితీపరీక్షించబడింది. ఈ విన్యాసాల ద్వారా, భారత సైన్యం పాకిస్తాన్‌ను లక్ష్యంగా చేసుకుని పూర్తి స్థాయి యుద్ధ వాతావరణానికి సిద్ధమవుతోందనేది స్పష్టమవుతోంది. పాకిస్తాన్ నేరుగా యుద్ధంలో పాల్గొంటే, పూర్తి స్థాయిలోతిప్పికొట్టే సామర్థ్యాన్ని భారతదేశం సిద్ధం చేస్తోంది. ఇందులో వైమానిక దాడుల నుండి మానవరహిత వాహనాల ద్వారా లక్ష్యాలను ఖచ్చితంగా నాశనం చేయడం వరకు అన్నీ ఉన్నాయి. ఈ శిక్షణలో, సైబర్ భద్రతా దళాలు, అంతరిక్ష పరికరాలు, లేజర్-బీమ్ ఆధారిత ఆయుధాలు మరియు మైక్రోవేవ్ ఆయుధాలు వంటి కొత్త తరం యుద్ధ ఆయుధాల పనితీరు యొక్క నిజాయితీ కూడా పరీక్షించబడింది. పాకిస్తాన్ యొక్క అణు ఆయుధాల వినియోగం గురించిన వ్యూహాత్మక వాతావరణాన్నిఎదుర్కోవడానికి యుద్ధ విన్యాసాలు కూడా నిర్వహించబడి ఉండవచ్చు. మొత్తంగా, ఈ సంయుక్త విన్యాసాలు భారతదేశం యొక్క యుద్ధ సన్నద్ధత, కొత్త సాంకేతికతలను సమన్వయం చేయడం మరియు భవిష్యత్తు యుద్ధ వాతావరణాలనుఎదుర్కోగల సామర్థ్యంపై విశ్వాసాన్నిపెంచుతున్నాయి.

# సంపాదకీయం

## 'వందేమాతరం' వెనుక అసలు వ్యూహం.. ఇదేనా?

పార్లమెంటు వేదికగా.. చర్చించేందుకు జాతీయ గేయం వందేమాతరాన్ని కేంద్ర ప్రభుత్వ పెద్దలు ఎంచుకోవడం వెనుక రీజన్ ఉందా? తెరవెనుక వేరే ఉద్దేశం కూడా దాగి ఉందా? అంటే.. ఔననే అంటున్నారు పరిశీలకులు. వాస్తవానికి ప్రస్తుతం(సోమవారం నాటికి) దేశంలో అత్యంత కీలకమైన, లక్షలాది మందిని తీవ్రంగా ప్రభావానికి గురిచేసిన అంశాలు రెండు ఉన్నాయి. 1) ఇండిగో విమానాల సంక్షోభం. 2) కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్). ఈ రెండు అంశాలపై చర్చకు ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. కానీ, ఏరికోరి కేంద్రం వందేమాతరం గేయంపై చర్చకు తెరదీసింది. అధికార పక్షం చెప్పిందే.. కీలకం కాబట్టి దీనిపైనే సభ ద ృష్టి పెట్టింది. అయితే.. వందేమాతరంపై చర్చసందరరేగా.. ప్రధాని మోడీ కీలకమైన అంశాల కంటే.. కూడా ఎక్కువగా పశ్చిమ బెంగాల్ రాష్ట్ర చరిత్ర.. ఆ రాష్ట్రానికే చెందిన జాతీయ గేయం రచయిత బంకిం చంద్ర ఛటర్జీ వృత్తాంతం.. ఆయన ఎదుర్కొన్న అవమానాలు.. బ్రిటీష్ వారు.. అప్పట్లో గాడ్ సేవ్‌దీ క్వీన్ అనే గీతాన్నిఇంటింటా పాడించాలని చూసినప్పుడు.. వారికి ప్రతిగా బంకిం చంద్ర.. వందేమాతరం గేయాన్నిరాశారని చెప్పారు. ఇది తర్వాత కాలంలో దేశ భక్తిని పురిగొల్పిందని.. అనంతర కాలంలో.. దేశానికి స్వాతంత్రం తీసుకువచ్చేందుకు వజ్రాయుధంగా కూడా మారిందని ప్రధాని చెప్పుకొచ్చారు. అయితే.. ప్రధాని మోడీ వందేమాతరం గేయానికి 150 ఏళ్లు నిండిన సందరాన్నీ తనకు అవకాశంగా మార్చుకున్నారని.. లోక్ సభలో ప్రతిపక్షాలు నిప్పులు చెరిగాయి. వచ్చే ఏడాది పశ్చిమ బెంగాల్(బంకిం చంద్ర ఛటర్జీ జన్మ రాష్ట్రం)లో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయని.. అందుకే అక్కడ సెంటిమెంటును రాజేసేందుకు ప్రధాని ఈ ప్రయత్నం చేసి.. పార్లమెంటును వినియోగించుకున్నా రని.. విపక్ష నాయకులు దుయ్యబట్టారు. ఇక, ఇదే అంశంపై జాతీయ మీడియాలో కూడా పలువురు విశ్లేషకులు స్పందిస్తూ.. ఎక్కడ ఎన్నికలు ఉంటే.. అక్కడి పాట పాడడం బీజేపీ నాయకులకు ముఖ్యంగా ప్రధానికి అలవాటుగా మారిందని చెప్పుకొ చ్చారు. అసలు దేశ చరిత్రలోఎప్పుడూ ఇప్పటి వరకు వందేమాతరం గేయంపై చర్చ చేపట్టలేదన్నారు. ఒకవేళ చర్చ చేపట్టినా.. దానిని రాజకీయాలకు ముడిపెట్టి కామెంట్లు చేయడం సరికాదన్నారు. అయినా.. ప్రస్తుతం ఇండిగో సమస్య దేశాన్ని తీవ్రస్థాయిలో కుదిపేస్తున్న దరిమిలా.. ప్రధాని స్థాయి నాయకుడు 45 నిమిషాల పాటు వందేమాతరంపై చర్చ చేపట్టి.. ప్రసంగించడం.. లక్షలాది మంది ప్రయాణికుల కష్టాలను కనీసం ప్రస్తావించకపోవడం దారుణమని విశ్లేషకులు వ్యాఖ్యానించారు. వచ్చే ఏడాది పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలోనే ఈ చర్చ కు తెరదీశారన్న వాదన బలంగా వినిపిస్తుండడం గమనార్హం.

# చెవిలో హెడ్‌సెట్.. చూపేమో రీల్స్ వైపు





హైదరాబాద్: స్టీరింగ్‌పై సెల్‌ఫోన్ పెట్టుకుని అందులో రీల్స్ చూస్తూ నిర్ల క్ష్యంగా డ్రైవింగ్ చేయడంతోగోల్కొండ ఠాణా పరిధిలో ఇటీవల ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న ట్రాలీ వాహనాన్ని గమనించకుండా ఆటో డ్రైవర్ ఢీకొట్టడంతో ఆటో పూర్తిగా దెబ్బతింది. డ్రైవర్‌తో పాటు నలుగురు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. నిర్లక్ష్యపూరిత డ్రైవింగే కారణమని క్షతగాత్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఒకప్పుడు ఒక చోట నుంచి మరోచోటకు వెళ్లడానికి రోడ్డుపై నిలబడితే ఆటోలు వచ్చి ప్యాసింజర్లను గమ్యస్థానాలకు చేర్చేవి. ఇప్పుడు అన్ని కార్యకలాపాలు ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయి. ఆటో, బైక్, ట్యాక్సీలను బుక్ చేసుకోవడం నుంచి గమ్యస్థానం వెళ్లేవరకు సెల్‌ఫోన్ తప్పనిసరి అవుతోంది. ఈ నేపథ్యంలో ప్రయాణికులను పికప్ చేసుకోవడం నుంచి డ్రాప్ చేసేవరకు గమ్యస్థానం కోసం మ్యాప్స్ చూస్తూ వెళ్లాల్సి ఉంటుంది. ఈ క్రమంలో చోదకులు చెవిలో హెడ్‌సెట్ పెట్టుకుని సెల్‌ఫోన్‌లో రీల్స్, యూట్యూబ్ వీడియోలు, క్రికెట్ మ్యాచ్‌లను వీక్షిస్తూ డ్రైవింగ్ చేస్తున్నారు. దీంతో బయటి ప్రపంచాన్నే మరచిపోతున్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్ ట్యాక్సీ అగ్రిగేటర్ల ద్వారా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చే చోదకుల్లో ఎక్కువ శాతం ఇలా నిర్లక్ష్యంగానే డ్రైవింగ్ చేస్తూ ప్రయాణికుల జీవితాలతో 'సెల్'గాటం ఆడుతున్నారు. సెల్‌ఫోన్ వాడుతూ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిస్తున్నా పెడచెవిన పెడుతున్నారు.

**అన్నింటి కంటే ప్రాణం ముఖ్యం**

'డ్రైవింగ్ చేస్తూ రీల్స్ చూడవద్దు. నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు. మీ నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో ఇతరుల ప్రాణాలు తీయొద్దు. కుటుంబాలను రోడ్డున పడేయవద్దు. రీల్స్ చూస్తూ వాహనం నడిపితే చర్యలు తప్పవు' అని హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ హెచ్చరించారు.

**బాధ్యత ఉండక్కర్లేదా?**

లొకేషన్ సులభంగా కనిపించడం కోసం ఆటో, బైక్ స్టీరింగ్‌పై సెల్‌ఫోన్‌ని ఉంచుతున్నారు. చూడటానికి అనువుగా ఉండటంతో సెల్‌ఫోన్‌లో వీడియోలు పెట్టుకుని చూస్తున్నారు. అంతటితో ఆగకుండా బ్లూటూత్ హెడ్‌సెట్‌లను చెవికి తగిలించుకుంటున్నారు. ఊపున్న డీజే పాటలు వింటూ ప్రయాణం సాగిస్తున్నారు. దీంతో ముందు వెళ్తున్న వాహనాల కదలికపై దృష్టి పెట్టడం లేదు. ఇరువైపులా, వెనక వచ్చే వాహనాల హారన్ శబ్దాలు వినపడటం లేదు. అకస్మాత్తుగా స్పీడ్‌బ్రేకర్లు వస్తే.. నియంత్రణ కోల్పోయి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇలా నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయవద్దని ప్రయాణికులు వారిస్తున్నా వినిపించుకోవడం లేదు.

# సార్లకివ్వాలి.. సర్దుకోలేరా!

సంగారెడ్డి: ఉమ్మడి మెదక్ జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఏ చిన్న అవకాశం వచ్చినా తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఇందుకు పదో తరగతి పరీక్ష రుసుంను పోషకుల నుంచి అందినంత దండుకుంటున్న తీరే నిదర్శనం. ఇదేంటని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తే.. ఇంటర్నల్ మార్కులు, ఇతరత్రాలకు 'సార్ల'కు ఎంతోకొంత ఇవ్వాల్సి ఉంటుంది.. ఆ మాత్రం సర్దుకోలేరా.. అంటూ యాజమాన్యాలు సమాధానమివ్వడం గమనార్హం.

వికారాబాద్ జిల్లాలో ప్రైవేటు బడులు: 91

పదో తరగతి విద్యార్థులు: 2648

అధికారుల పేరు చెప్పి..

సంగారెడ్డి జిల్లాలోని ప్రముఖ ప్రైవేటు పాఠశాలల్లో పదో తరగతి పరీక్ష రుసుం పేరిట రూ.900 తీసుకుంటున్నారు. ఎందుకు ఇంత మొత్తం వసూలు చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తే.. 'అందరినీ చూసుకోవాల్సి ఉంటుంది' అంటూ బదులిస్తున్నారు. మెదక్ జిల్లాలో ఓ ప్రైవేటు పాఠశాల పదో తరగతి పరీక్ష ఫీజు కింద రూ.1200 వసూలు చేస్తోంది. పదో తరగతి ఇంటర్నల్ మార్కుల సమయంలో తనిఖీలకు వచ్చే బృందాలతో పాటు విద్యాశాఖ అదికారులకు ఎంతో కొంత ఇస్తేనే మార్కులు వేస్తుంటారని యాజమాన్యం ప్రతినిధి పేర్కొంటున్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల కేంద్రాల్లోని పలు ప్రైవేటు పాఠశాలల్లో రూ.800 నుంచి రూ.1400




వరకు వసూలు చేస్తున్న తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**రూ.కోటికి పైగా ఆర్జన**

పదో తరగతి పరీక్ష రుసుంను అన్ని సబ్జెక్టులకు కలిపి రూ.125 చెల్లించాలి. ఈ నెల 20వ తేదీ వరకు గడువుంది.

ఇప్పటికే ట్యూషన్, కంప్యూటర్.. వంటి అనేక పేర్లతో ఇష్టారీతిన ఫీజులు తీసుకుంటున్న యాజమాన్యాలు.. పదో తరగతి పరీక్ష రుసుంను 5-10 రెట్లు ఎక్కువ చేసి వసూలు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లా, వికారాబాద్ వ్యాప్తంగా 18,666 మంది పదో తరగతి విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్నారు. ఒక్కో విద్యార్థి నుంచి రూ.500 అదనంగా వసూలు చేసినా.. రూ.93 లక్షలవుతుంది. రూ.800 చేస్తే రూ.1.49 కోట్లు వెనుకేసుకోనున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: జిల్లా విద్యాశాఖ

పదో తరగతి పరీక్ష రుసుంను అన్ని సబ్జెక్టులకు కలిపి రూ.125 మాత్రమే వసూలు చేయాలి. అదనపు వసూళ్లకు పాల్పడితే చర్యలుంటాయి. నిబంధనలు పాటించని పాఠశాలలపై విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేయవచ్చు.

# ఇందిరమ్మకు లక్ష్మీకటాక్షం



బొంరాస్‌పేట: పేదలకు సొంతింటి కలను నిజం చేసేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు పరుస్తోంది. గూడులేని నిరుపేదలు ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోంది. నిర్మాణ సామగ్రి, కూలీ ధరలు బాగా పెరగడంతో ప్రభుత్వం ఇస్తున్న మొత్తంలో ఇల్లు కట్టుకోవడం కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో నిరుపేద మహిళలకు బ్యాంకు ద్వారా మరో రూ.లక్ష వడ్డీలేని రుణం అందిస్తున్నారు. తీసుకున్న అప్పును వాయిదాల రూపంలో చెల్లించాల్సి ఉంటుంది.

బొంరాస్‌పేట మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన వెంకటమ్మకు సొంతిల్లు లేదు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసింది. నిర్మాణం ప్రారంభించారు. ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయం సరిపోయేలా లేదు. బయటి నుంచి అప్పు తెస్తే వడ్డీల భారం అధికమవుతోందని భయపడుతున్నారు. ఈ నేపథ్యంలో పొదుపు సంఘం ద్వారా బ్యాంకులు రూ.లక్ష రుణం ఇవ్వడం మంచి పరిణామం.

**జిల్లాలో 1,138 మందికి మంజూరు..**

జిల్లాలో 12,853 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. వారిలో 6,698 మంది మహిళలు స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్నారు. ఇప్పటి వరకు 1138 మంది మహిళలకు రూ.లక్ష చొప్పున బ్యాంకు రుణం అందించారు. ఇల్లు మంజూరైనా ఆర్థిక స్థోమత లేక, ప్రభుత్వం ఇచ్చే డబ్బులు సరిపోవని ఇంకా నిర్మాణాలు ప్రారంభించని వారు చాలామంది ఉన్నారు. ఇలాంటి వారికి బ్యాంకు రుణం ఎంతో ఉపయోగపడుతోంది.

**ఇవీ నిబంధనలు..**

ఇందిరమ్మ ఇల్లు మంజూరైన మహిళ పొదుపు సంఘంలో సభ్యురాలిగా ఉండాలి.

రుణం కావాలని మహిళా సంఘానికి దరఖాస్తు చేసుకుంటే సభ్యులంతా చర్చించి తీర్మానం చేస్తారు.

సూక్ష్మరుణ ప్రణాళిక(ఎంసీపీ) తయారు చేసి దాని ప్రతిని సంఘం తీర్మానానికి జతపర్చి బ్యాంకులో సమర్పించాలి.

బ్యాంకు అధికారులు పరిశీలించి సంబంధిత మహిళకు రుణం మంజూరు చేస్తారు.

బ్యాంకు రుణం ఉపయోగపడింది..: కొత్తకుర్వ లక్ష్మి, చౌదర్‌పల్లి

ఇందిరమ్మ ఇల్లు మంజూరైనా రూ.5 లక్షలు సరిపోయేలా లేవు. అప్పు చేస్తే వడ్డీ భారమవుతుంది. సంఘంలో సభ్యులైన వారికి రుణం ఇస్తున్నారని తెలిసి రూ.లక్ష తీసుకున్నా. చెత్తు వరకు నిర్మించుకున్నాం. ప్రభుత్వ సాయానికితోడు రుణం ఉపయోగపడింది.

# 2 శాఖలు.. 418 కిలోమీటర్లు

మెట్‌పల్లి: మెట్‌పల్లి మండలం ఏఎస్‌ఆర్ తండా శివారులోని లోలెవల్ కల్వర్టు ఇది. ఏటా వర్షాకాలంలో దీనిపై నుంచి వరద పారుతుండటంతో రాకపోకలు నిలిచిపోయి తండావాసులు ఇబ్బంది లు పడుతున్నారు. వంతెన నిర్మాణానికి 2022లో రూ.81 లక్షలు మంజూరైనా పనులు ప్రారంభం కాలేదు. ప్రస్తుతం హ్యామ్(హైబ్రిడ్ యాన్యుటీ మోడల్) విధానంలో ఆర్అండ్‌బీ రహదారి నుంచి ఏఎస్‌ఆర్ తండా వరకు నిర్మాణానికి ప్రతిపాదించారు. ఇందులో భాగంగా వంతెన నిర్మించనుండటంతో ఇబ్బందులు తొలగనున్నాయి.

**హ్యామ్ విధానంలో రహదారుల నిర్మాణం**

జిల్లాలో ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల పరిధిలో ఎంపిక చేసిన రోడ్లను హ్యామ్ విధానంలో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రెండు శాఖల పరిధిలోని సుమారు 418 కిలోమీటర్ల రహదారులను ఈ విధానంలో అభివృద్ధి చేయనున్నారు. ఆర్అండ్‌బీ శాఖ పరిధిలో 21 రహదారులను 227.99 కిలోమీటర్ల దూరం అభివృద్ధి చేయడానికి రూ.307.05 కోట్లతో ప్రతిపాదించి ప్రభుత్వానికి నివేదించారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో 89 పనులను 190.3 కిలోమీటర్ల దూరం నిర్మించడానికి త్వరలోనే పనులు ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది.

**నిర్వహణ బాధ్యత 15 ఏళ్లకు పెంపు**

హ్యామ్ విధానంలో రహదారులను ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో నిర్మించనున్నారు. నిర్మాణ వ్యయంలో 60 శాతం నిధులను గుత్తేదారు సంస్థకు ప్రభుత్వం బ్యాంకు రుణాన్ని ఇప్పిస్తుంది. ఆ సొమ్మును 15 సంవత్సరాల్లో వాయిదాల పద్ధతిలో ప్రభుత్వమే చెల్లిస్తుంది.

మిగతా 40 శాతం నిధులను దశలవారీగా ప్రభుత్వం విడుదల చేస్తుంది. గతంలో రహదారుల నిర్వహణ బాధ్యత కేవలం ఐదేళ్ల వరకు మాత్రమే గుత్తేదారులకు ఉండేది. దీంతో పనులు ఇష్టానుసా రంగా జరిగేవన్న అభిప్రాయముంది. హ్యామ్ విధానంలో 15 సంవత్సరాల పాటు గుత్తేదారు సంస్థ రహదారులను నిర్వహించాల్సి ఉంటుంది. దీంతో నిర్మాణంలో నాణ్యత




మెరుగుపడుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**నియోజకవర్గాల వారీగా ఇలా..**

హ్యామ్ విధానంలో ప్రతి నియోజకవర్గం నుంచి పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని రహదారులను ఎంపిక చేశారు. జగిత్యాలలో బీర్పూర్ మండలంలో 7, జగిత్యాల రూరల్ 9, జగిత్యాల అర్బన్ 2, రాయికల్ 7, సారంగాపూర్ 6, ధర్మపురి నియోజకవర్గంలో ధర్మపురి 7, వెల్గటూర్ 8, గొల్లపల్లి 4, పెగడపల్లి 5, వేములవాడ నియోజకవర్గంలో కథలాపూర్ 3, మేడిపల్లి 2, కోరుట్ల నియోజకవర్గంలో కోరుట్ల 4, మెట్‌పల్లి 8, మల్లాపూర్ 11, ఇబ్రహీంపట్నం 2, చొప్పదండి నియోజకవర్గంలో కొడిమ్యాల 2, మల్యాల 2 రహదారులను ఎంపిక చేశారు. మెట్‌పల్లి మండలంలో రేగుంట-గోధూర్, ఆత్మకూర్-పాటిమీదితండా, ఆత్మనగర్-అందుబొందుల తండా, జగ్గాసాగర్ మూలమలుపు-బండలింగాపూర్, జాతీయ రహదారి-కొండ్రికర్ల, జాతీయరహదారి-రాజేశ్వర్‌రావుపేట, ఆర్అండ్‌బీ రోడ్డు-ఏఎస్‌ఆర్ తండా, రేగుంట-అమ్మక్కపేట రహదారులను అభివృద్ధి చేయనున్నారు.

# ఛార్జింగ్ పెట్టేటప్పుడు జాగ్రత్త బ్రో



హైదరాబాద్ : ఎటువంటి ఫోన్ కొన్నా ఎక్కువ మంది పరిశీలించేది బ్యాటరీ.. ఎందుకంటే ఫోన్ ఎక్కువ సేపు పనిచేసేందుకు బ్యాటరీ సామర్థ్యం ముఖ్యం. మరి అంత ముఖ్యమైన బ్యాటరీని ఛార్జ్ చేసేప్పుడు ఎన్నో రకాల సందేహాలు.. దానికితోడు అప్పుడప్పుడు ఛార్జింగ్ చేస్తుంటే బ్యాటరీ పేలిపోయిందనే వార్తలు వింటున్నారు. ఛార్జింగ్ చేసేటప్పుడు జాగ్రత్తలు పాటిస్తే బ్యాటరీకి ఎటువంటి ఇబ్బందులు రావంటున్నారు.. టెక్ నిపుణులు.

హైదరాబాద్‌కు చెందిన కిరణ్ తన ఆఫీసు పనుల హడావుడిలో పడి ఛార్జర్‌ను ఇంటి వద్దే మరచిపోయారు. ఆఫీసుకు వెళ్లాక స్నేహితుడి వద్ద ఉన్న ఛార్జర్‌తో కొంత సేపు ఛార్జింగ్ పెట్టుకున్నాడు. రెండు, మూడు సార్లు అలా జరగడంతో చరవాణికి ఉన్న ఛార్జింగ్ పోర్టు పాడైపోయింది. రిపేర్ కోసం షాపు వద్దకు వెళ్లగానే రూ.5వేల వరకు ఖర్చు అవుతుందన్నారు.

ఓ మహిళ తన వద్ద ఉన్న ఒరిజినల్ ఛార్జర్ పాడైపోవడంతో వేరే సాధారణ ఛార్జర్‌ను వాడడం ప్రారంభించింది. కొన్ని రోజులు గడిచాక బ్యాటరీ ఉబ్బి ఫోన్ పేలిపోయేంత ప్రమాదం ఏర్పడింది. మరమ్మతులకు రూ.2-6 వేల వరకు ఖర్చు అవుతుందన్నారు.

ఫోన్ రాత్రంతా ఛార్జింగ్ పెట్టినా ప్రమాదం ఉండదు. ఎందుకంటే బ్యాటరీ వంద శాతం ఛార్జ్ అయిన తర్వాత ఛార్జింగ్ దానంతట అదే ఆగిపోతుంది. ప్రస్తుతం తయారవుతున్న ఫోన్లలో బ్యాటరీలు సామర్థ్యానికి మించి ఛార్జ్ కాకుండా ప్రత్యేక టెక్నాలజీ ఉపయోగిస్తున్నారు.

ఒకవేళ రాత్రి ఫోన్ ఛార్జింగ్ పెట్టి అలాగే వదిలేయాలనుకుంటే.. చరవాణిని కవర్(పౌచ్)లో నుంచి బయటికి తీసి ఛార్జింగ్ పెట్టడం మంచిది.

**కంపెనీ ఛార్జర్ ఉత్తమం..**

ఫోన్ ఛార్జ్ చేసేందుకు ఉపయోగించేది కంపెనీ ఛార్జర్ అయితే చాలా మంచిది. నాసిరకం ఛార్జర్ ఉపయోగిస్తే ఫోన్ లేదా ఛార్జర్ కాలిపోయే ప్రమాదం ఉంది. కంపెనీ ఇచ్చే ఛార్జర్లను అనేక రకాలుగా పరీక్షించి ఆమోదముద్ర వేస్తుంది. వాటితో ప్రమాదం ఉండదు.

**లిథియం బ్యాటరీ అయితే..:** ఫోన్లో లిథియం-అయాన్ బ్యాటరీ ఉంటే ..తక్కువ సమయం ఎక్కువసార్లు ఛార్జ్ చేసుకున్నా సరిపోతుంది. ఉదా: 5-10 శాతం వరకు ఛార్జ్ చేసి.. కొంతసేపు వాడుకుని 10-30 శాతం వరకు అలా..అవసరాన్ని బట్టి ఛార్జ్ చెయ్యొచ్చు.

తప్పని పరిస్థితుల్లో..

తప్పని పరిస్థితుల్లో సాధారణ ఛార్జర్లు ఉపయోగించాల్సి వస్తే.. వాటితో వంద శాతం ఛార్జ్ చేయకపోవడం మంచిది. బ్యాటరీ చివరి 20శాతం ఛార్జ్ అయ్యేప్పుడు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటుంది. ఆ సమయంలోపేలిపోయే ప్రమాదం ఉంది.

# వృద్ధాప్యంలో రైతులకు భరోసా

చేవెళ్ల: చిన్న, సన్నకారు రైతులకు వృద్ధాప్యంలో ఆర్థిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 'కిసాన్ మాన్ ధన్ యోజన' పథకానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు పింఛన్లు అందిస్తుండగా.. ఇప్పుడు కేంద్రం ప్రత్యేకంగా రైతుల కోసం పింఛను పథకాన్ని అమల్లోకి తెచ్చింది. ఐదెకరాల్లోపు కర్షకులే అర్హులు: 18 నుంచి 40 ఏళ్ల వయసు, 5 ఎకరాల్లోపు వ్యవసాయ భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులే అర్హులు. భూ రికార్డుల్లో పేరుండాలి. రైతు నిర్ణీత ప్రీమియం చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఇప్పటికే నేషనల్ పెన్షన్ స్కీమ్, ఈఎస్‌ఐ, ఈపీఎఫ్‌లో చేరిన వారు ఈ పథకానికి అనర్హులు. ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయ పన్ను చెల్లింపుదారులు, ఆర్థికంగా ఉన్నవారు, ఇతర సామాజిక భద్రత పథకాలను పొందుతున్న వారికి ఈ పథకం వర్తించదు.నామమాత్రపు ప్రీమియం: రైతులు వయసు ఆధారంగా ప్రతినెల రూ.55 నుంచి రూ.200 వరకు ప్రీమియం చెల్లించాలి. దీనికి సమానంగా కేంద్ర ప్రభుత్వం జమ చేస్తుంది. 60 ఏళ్ల వరకు ప్రీమియం చెల్లిస్తే, తర్వాత ప్రతి నెలా రూ.3 వేల పింఛను అందుతుంది. రైతు మరణించిన పక్షంలో భార్య లేదా నామినీకి నెలకు రూ.1,500 సాయం అందుతుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు: అర్హులైన రైతులు సమీపంలోని సీఎస్‌సీ కేంద్రాల ద్వారా కానీ, పీఎం కిసాన్ పోర్టల్‌లో కానీ దరఖాస్తు చేసుకోవాలి. ఆధార్ నంబరు, నామినీ, రైతు బ్యాంకుఖాతా వివరాలుఅప్‌లోడ్ చేయాలి. ఈ ప్రక్రియ పూర్తయ్యాక పింఛను కార్డు జారీ అవుతుంది. ప్రతినెలా ప్రీమియం రైతు బ్యాంకు ఖాతా నుంచి నేరుగా డెబిట్ అవుతుంది.

# ధాన్యం.. 'మర'యుద్ధం

భగత్‌నగర్: మిల్లులకు కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) ధాన్యం కేటాయింపులలో అసమానతలు జరిగాయనే వివాదం పతాక స్థాయికి చేరుకుంటుంది. నిజాయతీగా ధాన్యం మర ఆడించి ప్రభుత్వానికి తిరిగి ఇస్తున్నా.. కేటాయింపుల్లో అన్యాయం చేస్తున్నారని మిల్లర్లు పేర్కొంటున్నారు. పారదర్శకత, నిర్వహణ, పనితీరు ఆధారంగా కేటాయించామని అధికారులు అంటున్నారు. సంతృప్తి చెందని మిల్లర్లు రాష్ట్ర స్థాయిలో కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఇదే సమయంలో రైస్ మిల్లర్ సంక్షేమ సంఘం నిధుల నుంచి చెల్లింపులు, బహిరంగ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**రాజుకున్న కుంపటి..**

మిల్లుల్లో ధాన్యం మర ఆడించగా వచ్చిన బియ్యం ఎఫ్‌సీఐకి తరలిస్తుంటారు. ఇందుకు పౌరసరఫరాల శాఖ ఒక్కో మిల్లుకు 1740 క్వింటాళ్ల(బెడ్) లెక్కల్లో కేటాయిస్తోంది. జిల్లాకు 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఎఫ్‌సీఐ తీసుకోవడానికి లక్ష్యంగా నిర?యించింది. మిల్లరు తనకు కేటాయించిన ధాన్యాన్ని నిర్దేశించిన మేర మిల్లింగ్ చేసి ఎఫ్‌సీఐకి అందివ్వాలి. ఇక్కడే వివాదం రాజుకొంది. పౌరసరఫరాల



శాఖాధికారులు బెడ్‌ల కేటాయింపులో వివక్ష చూపారని మిల్లర్లు ఆరోపిస్తున్నారు.

**విద్యుత్తు బిల్లులపై విచారణ చేయాలి: గుండె రావు, మిల్లు యజమాని**

30 ఏళ్లుగా వ్యాపారం చేస్తున్నా. నాలాంటి వారికి బెడ్‌లు కేటాయించకపోవడంతో అక్టోబరు 29 నుంచి 15 ఏసీకేల బియ్యం మిల్లింగ్ చేసి మిల్లులో నిల్వ చేసుకోవాల్సి వస్తోంది. నెలకు రూ.12 లక్షల నిర్వహణ ఖర్చులు చెల్లిస్తున్నా.. మిల్లు నడిపిస్తే రూ.6 లక్షల విద్యుత్తు బిల్లు.. నడవకపోతే స్థిర ఛార్జీల కింద రూ.2.60 లక్షలు చెల్లిస్తున్నా. ధాన్యం మర ఆడించి సీఎంఆర్ ఇస్తున్న మిల్లుల విద్యుత్తు బిల్లులపై విచారణ చేయిస్తే మోసం బయటపడుతుంది. పలువురు మిల్లర్లు రేషన్ బియ్యం కొనుగోలు చేసి రీసైకిల్ చేస్తున్నారు.

పనితీరు ఆధారంగా..: నర్సింగరావు, పౌరసరఫరాల శాఖాధికారి, కరీంనగర్‌మిల్లుల నిర్వహణ, పనితీరు ఆధారంగా ఏ, బీ, సీ మూడు గ్రూపులు చేసి, వాటికి బెడ్‌లు కేటాయింపులు చేశాం. వేగంగా మర ఆడించిన వారికి పరిగణనలోకి తీసుకున్నాం.

# సింగరేణిలో అప్రెంటిస్‌షిప్ చేయాలనుందా?

ఖమ్మం :ఏడాది పాటు అప్రెంటిస్‌షిప్ చేసేందుకు సుముఖంగా ఉన్నవారి కోసం సింగరేణి సంస్థ శనివారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థులు ఈ నెల 25లోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆ ప్రతిని విద్యార్హత, కుల ధ్రువీకరణ, ఆధార్‌కార్డుతో కలిపి సమీపంలోని ఏరియా ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్లలో అందజేయాల్సి ఉంటుంది. 18 సంవత్సరాలు నిండి 28 ఏళ్లలోపు వారు అర్హులు. రిజర్వేషన్ అభ్యర్థులకు 33 ఏళ్లలోపు వర్తిస్తుంది.

**95శాతం స్థానికులకే..**

స్థానికులకు 95శాతం, స్థానికేతరులకు 5శాతం రిజర్వేషన్ పద్ధతిన అప్రెంటిస్ చేసే అవకాశాన్ని కల్పించనున్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్ రూరల్, వరంగల్ అర్బన్, జనగాం, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, ఆదిలాబాద్, నిర్మల్, అసిఫాబాద్, మంచిర్యాల అభ్యర్థులను స్థానికులుగా మిగిలిన జిల్లాల అభ్యర్థులను స్థానికేతరులుగా గుర్తిస్తారు. అభ్యర్థుల సీనియారిటీ ప్రాతిపదికగా అవకాశాన్నిస్తారు. ఒకే సంవత్సరం ఉత్తీరు?లైతే వారి మార్కుల ఆధారంగా సీటు కేటాయిస్తారు.

తుది జాబితాను కార్పొరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసే ప్రత్యేక కమిటీ నిర?యిస్తుంది.

ఎంపికైన అభ్యర్థుల జాబితాను సింగరేణి వెబ్‌సైట్లోనూ, ప్రధాన కార్యాలయంలోని నోటీసుబోర్డుపైనా ప్రకటిస్తారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు చివరి తేదీ: 25.12.25

రిజిస్టర్ చేసుకొనే వెబ్‌సైట్: %www.apprenticeshipindia.org

దరఖాస్తును అప్‌లోడ్ చేయాల్సిన వెబ్‌సైట్: %scclmines.com

%సమీపంలోని ఎంవీటీసీలకు హార్డ్‌కాపీలను సమర్పించేందుకు చివరి తేదీ: 08.12.25 నుంచి 25.12.2025 దాకా

ట్రేడ్లు: ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, టర్నర్, మిషనిస్టు, మెకానిక్ మోటార్‌వెహికిల్, డ్రాఫ్ట్స్‌మెన్, డీజిల్ మెకానిక్, వెల్డర్

అప్రెంటిస్‌షిప్ కాలపరిమితి: ఏడాది

స్టైఫండ్: రెండేళ్ల ఐటీఐ పూర్తిచేసిన ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, టర్నర్, మిషనిస్టు, మెకానిక్ మోటార్ వెహికిల్, డ్రాఫ్ట్స్‌మెన్‌లకు రూ.8,050 చొప్పున ఒక సంవత్సరం ఐటీఐ పూర్తిచేసిన డీజిల్ మెకానిక్, వెల్డర్లకు రూ.7,700 చొప్పున చెల్లిస్తారు.

# అస్మిత వ్యక్తి కాదు.. వ్యవస్థ

ఖమ్మం : 'అస్మిత'.. ఈ పేరు వినగానే బాలిక లేదా యువతి పేరులా అనిపిస్తుంది కదూ. కానీ ఇది వారి పేరు కాదు. ఓ క్రీడా వ్యవస్థ.. సహజ క్రీడా లక్షణాలు, ప్రతిభ ఉన్న బాలికలను వెతికిపట్టేందుకు కేంద్రం తీసుకొచ్చిన కార్యక్రమం.

దేశ వ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో పోటీలు నిర్వహించే కార్యక్రమానికి అస్మిత అని పెట్టారు. అంటే 'అచీవింగ్ స్పోర్ట్స్ మైల్‌స్టోన్ బై ఇన్‌స్పైరింగ్ విమెన్ త్రో యాక్షన్'.. ఖేలో ఇండియాలో భాగమైన దీనిపై ఇప్పటికీ ఉమ్మడి జిల్లా క్రీడా రంగంలో పూర్తిస్థాయి అవగాహన లేదు. జిల్లా యువజన శాఖలోనూ పథకం సమాచారం, వివరాలు లేవు. వూషు, వెయిట్ లిఫ్టింగ్, ఫుట్‌బాల్ సంఘాలు మాత్రమే అవగాహనతో టోర్నీలకు పంపుతున్నారు.

**విలక్షణ ఎంపిక**

ఖమ్మంలో ఇటీవల అస్మిత అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. టోర్నీకి వచ్చిన పరిశీలకుణ్ని పలకరించగా, నిర్వహణకు కేంద్రం నుంచి రూ.70 వేలు నిధులు అందుతాయని, ముందుగా రూ.35 వేలు.. టోర్నీ పూర్తి వివరాలు అందిన తర్వాత మరో రూ.35 వేలు విడుదల చేస్తారని తెలిపారు.

విజేతలకు పతకాలు, సర్టిఫికెట్లు ఖేలో ఇండియా నుంచే అందిస్తారు. అకాడమీలు, శిక్షణ కేంద్రాల్లో సాధన చేస్తున్న క్రీడాకారిణులు పోటీలో రాణించినా పరిగణలోకి తీసుకోరు.

కొత్తగా పోటీలో పాల్గొని ప్రతిభావంతంగా రాణించిన వారిని మాత్రమే గుర్తిస్తున్నారు. ప్రతిభగల ఇలాంటి క్రీడాకారుల జాబితా సిద్ధంచేసి వారిని శిక్షణ కేంద్రాలకు పంపుతారు.

# అధునాతన వసతులు.. ఉత్తమ చదువులు



బొంరాస్‌పేట: విద్యాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. వీటిలో ఉత్తమ బోధన, అధునాతన సౌకర్యాలు కల్పించాలని యోచిస్తోంది. ఇందుకోసం రాష్ట్రంలోని అయిదు జిల్లాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. జిల్లాలోని ప్రతి మండలానికి ఒక ఉన్నత పాఠశాలను బెస్ట్ స్కూల్‌గా ఎంపిక చేయాలని నిర?యించింది. దీనికిగాను జిల్లా ఎంపికైంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలానికి ఒక జడ్పీ ఉన్నత పాఠశాలను ప్రతిపాదించారు. ప్రభుత్వం ఆమోదం తెలిపి నిధులు మంజూరైతే 20 మండలాల్లోని పాఠశాలల రూపురేఖలే మారనున్నాయి.

**గ్రామీణ జిల్లాకు ఎంతో ఉపయోగం..**

ఉత్తమ పాఠశాలలుగా ఎంపిక చేసి అభివృద్ధి పరిస్తే జిల్లాలోని గ్రామీణ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుంది. ప్రస్తుతమున్న ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులున్నా ల్యాబ్ వసతి, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్లు, ఆట సామగ్రి లేవు. కొన్నిచోట్ల తాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదులు వంటి వసతి సౌకర్యాలు లేక ఇబ్బందిగానే ఉంది. ఉత్తమ బడులుగా ఎంపికైతే అన్ని సౌకర్యాలు సమకూరుతాయని భావిస్తున్నారు.

**ప్రతిపాదించిన బడులు ఇవే..**

జిల్లాలో ఉత్తమ పాఠశాలల ఎంపిక కోసం మండలానికి ఒకటి చొప్పున 20 బడులను అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. వాటిలో అన్నీ జడ్పీ ఉన్నత పాఠశాలలే ఉన్నాయి. బంట్వారం మండలం తొర్మామిడి, బషీరాబాద్(బాలికలు), బొంరాస్‌పేట, చౌడాపూర్ మండలం మరికల్, ధారూరు, దోమ, దౌల్తాబాద్, దుద్యాల మండలం హకీంపేట, కొడంగల్(బాలికలు), కోట్‌పల్లి, మర్పల్లి మండలం పట్లూరు, మోమిన్‌పేట(బాలుర), నవాబ్‌పేట మండలం చించల్‌పేట, పరిగి నెంబరు.1, పెద్దేముల్ (బాలుర), పూడూరు, తాండూరు ప్రభుత్వ నెంబర్.1, వికారాబాద్(బాలికలు), కులకచర్ల మండలం ముజాహిద్‌పూర్, యాలాల మండలం అగ్గనూరు ఉన్నాయి.

**జాబితా పంపించాం..: రేణుకాదేవి, డీఈఓ**మండలానికి ఒక ఉత్తమ పాఠశాలలను ఎంపిక చేసి కార్పొరేట్ తరహాలో అభివృద్ధి పరచాలని ప్రభుత్వం నిర?యించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 20 మండలాల పరిధిలోని ఇరవై ఉన్నత పాఠశాలలను ఎంపిక చేసి జాబితా పంపారు. ఆమోదం తెలిపాల్సి ఉంది.

# ఆహార శుద్ధి.. ఆర్థిక వృద్ధి



పరిగి : మహిళా సంఘాల ఉన్నతికి కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా కృషి చేస్తున్నాయి. వడ్డీలేని రుణాలు అందిస్తూ కోటీశ్వరులను చేసే దిశగా ప్రోత్సహిస్తున్నాయి. ఇప్పటికే చిన్నచిన్న వృత్తి వ్యాపారాలతో రాణిస్తూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్న సంఘాలకు వ్యాపారపరంగా అవకాశాలు కల్పిస్తోంది. వ్యక్తిగతంగా, సమష్టిగా రుణాలిప్పిస్తూ ఉపాధి చూపుతోంది. దీంతో వేలాది మంది మహిళలు అవకాశాలను సద్వినియోగం చేసుకునేందుకు పోటీపడుతున్నారు. మండలాల్లో పండిస్తున్న పంటలు, రవాణా, ఇతర ఉత్పత్తులు, మార్కెటింగ్ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తూ పరిశ్రమల స్థాపనకు చేయూతనిస్తున్నాయి.

**పీఎంఎఫ్ఎంఎఫ్ఈఎస్ కింద..**

ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార తయారీ, శుద్ధి సంస్థల పథకం(పీఎంఎఫ్ఎంఎఫ్ఈఎస్) కింద జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆహారశుద్ధి పరిశ్రమలను ప్రారంభించేందుకు అడుగులు పడుతున్నాయి. 200 యూనిట్ల ఏర్పాటుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. యూనిట్‌కు రుణంగా 55 శాతం, రాయితీ 35, కాంట్రిబ్యూషన్ 10 శాతం ఉండేలా చూస్తున్నారు. ఔత్సాహికులకు రాజేంద్రనగర్‌లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

**మండలాల వారీగా గుర్తింపు**

మండలాల్లో పండిస్తున్న పంటలు, ఉత్పత్తుల ఆధారంగా యూనిట్లను ఏర్పాటు చేస్తారు. కుల్కచర్ల మండలంలో చిరుధాన్యాల సాగు అధికం. తాండూరు, బొంరాస్‌పేటలో కందిపప్పు, మోమిన్‌పేటలో పశువులదాణా, వికారాబాద్‌లో పండ్లు, కూరగాయలు, పరిగిలో సూప్స్ తయారీ, దోమ మండలంలో చింతపండు, మామిడి ఒరుగు తయారీ వంటివి ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు.

**మహిళలకు సువరావకాశం..: శ్రీనివాస్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి** మహిళలు వ్యాపార రంగంలో ఎదగాలన్నదే ఆశయం. లైవ్‌స్టాక్ కింద నాటుకోళ్లు, గొర్రె పొట్టేళ్ల పెంపకానికి రూ.1.90 కోట్లు వెచ్చిస్తున్నాం. వీటిని గ్రౌండింగ్ చేస్తున్నాం. వ్యక్తిగతంగా, సమష్టిగా సంఘాలు పరిశ్రమలను ఏర్పాటు చేసుకుంటే స్థానికంగా గ్రామాల్లోనే ఉపాధి పొందే అవకాశముంది. ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార తయారీ, శుద్ధి సంస్థల పథకం మహిళలకు ఒక వరం లాంటిది.

జిల్లాలో మండలాలు: 20

సంఘాలు: 15,711

గ్రామ సమాఖ్యలు: 648

సభ్యులు: 1,63,843

ఆహారశుద్ధి పరిశ్రమల యూనిట్ల లక్ష్యం: 200

గతేడాది యూనిట్ల లక్ష్యం: 190

ప్రారంభం: 140

వెచ్చించిన నిధులు: రూ.12.83 కోట్లు

# దూదిపూలు.. కష్టాలపాలు



పూడూరు: పత్తి రైతులకు కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. సీసీఐ రోజుకో నిబంధన అమలు చేస్తుండడంతో గందరగోళం నెలకొంటోంది. నాణ్యత తగ్గుతుందనే సాకుతో సీసీఐ అధికారులు ధర తగ్గించారు. మూడేళ్లుగా అన్నదాతలు సీసీఐ కేంద్రాల్లోనే అమ్ముకొంటున్నారు. ఈసారి తేమశాతం 8కి మించరాదని.. క్వింటా పత్తికి రూ.8,110 మద్దతు ధర ప్రకటించింది. ఇటీవల ధర తగ్గించారు. దీంతో క్వింటాకు రూ.7,900 మించడం లేదు. ఎకరాకు 12 క్వింటాళు తీసుకోవాలనే పరిమితి ఉన్నా.. ఏడుకే కుదించారు. దీన్ని వ్యతిరేకిస్తూ పత్తిమిల్లర్లు రెండ్రోజులపాటు కొనుగోళ్లు నిలిపేసి నిరసన తెలిపారు. దీంతో 12 క్వింటాళ్లు తీసుకునేందుకు ఒప్పుకున్నా ఏఈఓలకు ముడిపెట్టారు. దీంతో అన్నదాతలు అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. అక్రమాలను అరికట్టేందుకు ఈసారి సీసీఐ కపాస్ కిసాన్ యాప్ తెచ్చింది. ప్రస్తుతం అది సరిగా పనిచేయక దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది.

**వేధిస్తున్న కూలీల కొరత..**

చేతికొచ్చిన పత్తి తీయాలంటే కూలీలతో ఇబ్బందులు తప్పడం లేదు. స్థానికంగా కూలీల కొరత ఉండటంతో చాలామంది రైతులు వివిధ ప్రాంతాల నుంచి రప్పించారు. గతేడాది కిలో పత్తి తీయాలంటే రూ.11- 13 తీసుకునేది. ఒక్కొక్కరు నిత్యం 80- 100 క్వింటాళ్ల వరకు తీసేవారు. ఈసారి వర్షాలతో పంట ఆశాజనకంగా లేకపోవడంతో కాయ నుంచి పత్తి సులువుగా రావడం లేదు. ఒక్కొక్కరు నిత్యం 40- 50 కిలోలకు మించి తీయడం లేదని, గిట్టుబాటు కాక కూలీ ధర పెంచేశారు. పొలాల్లో పంట అనుకూలాన్నిబట్టి కిలోకు రూ.15- 20 వరకు తీసుకుంటున్నారు. స్థానిక కూలీలకు రోజుకు రూ.500 చెల్లిస్తే 10- 15 కిలోలైనా తీయడం లేదు.

**మరింత తగ్గే అవకాశం..**

సారంగపాణి, జిల్లా మార్కెటింగ్ అధికారి

పత్తి దిగుబడులు తగ్గటంతో కొనుగోళ్లు ఎక్కువ రోజులుండవు. పత్తి తీయించిన రైతులు నిల్వ పెట్టుకోకుండా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలి. ధర మరింత పడిపోయే అవకాశముంది. చివరి పత్తి నాణ్యత కోల్పోవడంతో ధర తగ్గించాల్సి వస్తోంది. ఆరబెట్టిన పత్తిని తెచ్చి మద్దతు ధర పొందాలి.

జిల్లాలో పత్తి సాగు: 2.50 లక్షల ఎకరాలు

గతనెల సీసీఐ మద్దతు ధరక్వింటాకు: రూ.8,110

ప్రస్తుతం చెల్లిస్తున్నది:రూ. 7,900

సీసీఐ కేంద్రాలు: 14

ఇప్పటి వరకు సేకరణ:35 వేల మె.ట.

# పంచాయతీ పోరు.. స్థిరాస్తి వ్యాపారుల హెూరు

సిరిసిల్ల: పంచాయతీ ఎన్నికల్లో స్థిరాస్తి వ్యాపారులు ఈ ఎన్నికల్లో పోటీకి ఉత్సుకత ప్రదర్శిస్తూ.. సర్పంచి పీఠం కోసం సర్వశక్తులు ఒడ్డుతున్నారు. అందివచ్చిన రిజర్వేషన్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ భవిష్యత్తు రాజకీయ ప్రణాళికను రచిస్తున్నారు. స్థిరాస్తి వ్యాపారంలో కూడబెట్టుకున్న సొమ్మును ఎంత ఖర్చు చేయడానికైనా వెనుకాడకుండా ఉన్నారు. తొలి, రెండో విడత బరిలో నిలిచే అభ్యర్థులు తేలడంతో ప్రచారానికి సిద్ధమవుతుండగా.. మూడో విడత నామినేషన్ల ఉపసంహరించుకునేలా పోటీలోని అభ్యర్థులను 'మచ్చిక' చేసుకునే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు.

**సందడే సందడి**

సర్పంచి ఎన్నికలచి గెలవడానికి ఎంత ఖర్చు అయినా భరించాలన్న క ృతనిశ్చయంతో అభ్యర్థులు ఉన్నారు. ఈ ఎన్నికను వారు ఎంత ప్రతిషా'త్మకంగా తీసుకుంటున్నారో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో ఎన్నికల సంఘం విధించిన వ్యయ పరిమితులు దాటిపోయాయి. ఓటర్ల సంఖ్య, గ్రామపంచాయతీ స్థాయిని బట్టి.. అనధికారికంగా రూ.30 లక్షల నుంచి రూ.కోటి వరకు ఖర్చు



చేయాలన్న నిర?యంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో.. గ్రామాల్లో మద్యం ఏరులై పారుతూ విచ్చలవిడిగా డబ్బు పంపిణీ జరిగే అవకాశముంది. పోటీ అధికంగా ఉన్న గ్రామాలపై ఎన్నికల అధికారులు నిఘాను తీవ్రతరం చేసి మద్యం, డబ్బు పంపిణీ అరికట్టాలన్న అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి.

**గెలుపే ధ్యేయంగా..**

తంగళ్లపల్లి మండల కేంద్రంలో సర్పంచి అభ్యర్థులుగా అయిదుగురు బరిలో ఉన్నారు. అందులో నలుగురు స్థిరాస్తి వ్యాపారులు గుత్తేదారులే. ఆరు వేలకుపైగా ఓటర్లు ఉన్న ఈ పంచాయతీలో అభ్యర్థులు నువ్వానేనా అన్నట్లుగా ఉంది. ఇదే మండలం జిల్లెల మేజర్ పంచాయతీలోనూ ఇద్దరు స్థిరాస్తి వ్యాపారుల మధ్య గట్టిపోటీ ఉంది. ఈ రెండు పంచాయతీల్లో రూ.50 లక్షల నుంచి రూ.కోటిపైనే ఖర్చు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

ఇల్లంతకుంట మండలం కందికట్కూరులో గ్రానైట్ వ్యాపారి ఒకరు బరిలో ఉన్నారు. నామినేషన్లకు ముందే గ్రామంలో కుల సంఘాలను ఏకంచేసి మద్దతు కూడబెట్టుకున్నారు. ఒక్కో కులసంఘానికి ఒక్కో పని చేసేందుకు ఒప్పందాలు చేసుకున్నారు.


ఎల్లారెడ్డిపేట మండలం కేంద్రంలో విచిత్రంగా సర్పంచి, వార్డు సభ్యులను గెలిపించుకునేందుకు స్థిరాస్తి వ్యాపారులు పోటీపడుతున్నారు. ఈ నెల 9న ఉపసంహరణకు ముందే తమ ప్యానెల్‌లో మెజారిటీ వార్డు సభ్యులను తమవైపు తిప్పుకొనే ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

# రవాణా భారం.. సేవలకు దూరం

ధర్మపురి: ఉమ్మడి జిల్లాలో డయాలసిస్ రోగుల సంఖ్య పెరుగుతోంది. ప్రభుత్వం జగిత్యాల, ధర్మపురి, పెద్దపల్లి, కోరుట్ల, మంథని, కరీంనగర్, సిరిసిల్ల, వేములవాడల్లో డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేసినా.. ప్రజలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవటం లేదు. ప్రతి కేంద్రంలో నిత్యం ఒక్కొక్క రోగికి 4 గంటలు ఉచితంగా సేవలందిస్తున్నారు. రోగులు వారానికి రెండు నుంచి మూడు సార్లు ఈ సేవలు పొందాల్సి ఉండగా.. దగ్గర్లలోని కేంద్రాలను కాదని.. కరీంనగర్, హైదరాబాద్ నగరాలకు వెళ్తున్నారు. దీంతో శారీరక, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక కేంద్రాల్లో ఇంకా పది మంది వరకు సేవలు పొందొచ్చు.

**ప్రైవేటులో భారం**

ఒక్క నెలలో డయాలసిస్ సేవలకు ప్రైవేటు ఆస్పత్రుల్లో అయితే దాదాపు రూ.20 వేల వరకు ఖర్చు అవుతాయి. పైగా పరికరాలను మళ్లీమళ్లీ వాడుతుంటారు. ప్రభుత్వ ఆసుపత్రులోని కేంద్రాల్లో ఒకసారి వాడిన పరికరాన్ని మళ్లీ వాడటం లేదు. రక్తం పెరిగే ఇంజక్షన్లు ఉచితంగా రోగులకు అందిస్తున్నారు. వ్యాధి విషయం అందరికి తెలుస్తుందని..



రవాణా భారం, స్థానికంగా కేంద్రం ఉన్న వివరాలు తెలియక వినియోగించుకోవటం లేదు.

**ఆటోలే దిక్కు**

దాదాపు అన్ని కేంద్రాలకు వెళ్లాలంటే బస్టాండులలో దిగి ఆటోల్లో ప్రయాణించాలి. రవాణాకు రూ.100 వరకు భారం పడుతోంది. స్థానిక డయాలసిస్ రోగులు.. ఉమ్మడి జిల్లా కేంద్రానికి వెళ్తున్నారు. రాయపట్నంలో బస్సు ఎక్కితే ప్రతిమ, ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద దింపుతోంది. అదే ధర్మపురికి వెళ్తే బస్టాండ్‌లో దిగి.. రూ.100లతో ప్రభుత్వాస్పతికి వెళ్లాలి. క్షేత్రస్థాయిలో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, పీహెచ్‌సీ సిబ్బంది ప్రచారం చేస్తూ.. రోగులకు బస్టాండుల నుంచి ప్రత్యేక వాహన సదుపాయం కల్పిస్తే కేంద్రాలకు పూర్తిస్థాయిలో బాధితులు వస్తారు.

ప్రత్యేక రవాణా సదుపాయం కల్పించాలి: పెద్దనేని గంగవ్వ (బుగ్గారం) ఏడాదిన్నరగా ధర్మపురికి డయాలసిస్ చేసుకోవటానికి వస్తున్నాను. అయితే బస్టాండు నుంచి ఆసుపత్రికి రావడానికి చాలా ఇబ్బందిగా ఉంటోంది. ప్రభుత్వం ప్రత్యేక రవాణా సదుపాయం కల్పించాలి.

**మరో 20 మందికి అవకాశం: వినయ్, కేంద్రం నిర్వాహకులు**

ధర్మపురిలో డయాలసిస్ కేంద్రం అందుబాటులో ఉంది. ప్రజలు వినియోగించుకోవాలి. ఇక్కడి నుంచి జగిత్యాల, కరీంనగర్ ప్రాంతాలకు వెళ్తున్నారు. ధర్మపురిలో ప్రస్తుతం 20 మంది రోగులు వస్తున్నారు. మరో 20 మంది వినియోగించుకునే వీలుంది.

# క్యూర్‌కు మెట్రో దన్ను

హైదరాబాద్: హైదరాబాద్ బృహత్ నగరంలో ప్రజా రవాణాకు ప్రాధాన్యం ఇచ్చేలా తెలంగాణ రైజింగ్ 2047 నాటికి మెట్రోరైలు/లైట్ రైల్ ట్రాన్సిట్/బీఆర్‌టీఎస్‌ను 623 కి.మీ.పైగా విస్తరించాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. బాహ్య వలయ రహదారి వరకు పరిగణిస్తున్న కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ(క్యూర్)కి మెట్రో దన్నుగా నిలవనుందని భావిస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో 69.2 కి.మీ. మెట్రోరైలు నెట్‌వర్క్ ఉంది. రెండోదశ '2ఏ', '2బీ'లో మరో 152.5 కి.మీ. మేర ప్రతిపాదనలు కేంద్రం పరిశీలనలో ఉన్నాయి. నాగోల్ నుంచి శంషాబాద్ విమానాశ్రయం, విమానాశ్రయం నుంచి భారత్ ఫ్యూచర్‌సిటీ వరకు 9 మార్గాలు ఇందులో ఉన్నాయి. వీటితో



పాటు రాబోయే 22 ఏళ్ల కోసం 400 కిలోమీటర్లకుపైగా విస్తరించాలనేది 'క్యూర్' వ్యూహాల్లో ఒకటిగా ఉంది. ఓఆర్ఆర్ వరకు జీహెచ్‌ఎంసీ విస్తరణతో అక్కడివరకు వేర్వేరు మార్గాల్లో మెట్రో పొడిగించనున్నారు. ప్రస్తుతం ప్రజారవాణా సుమారు 30శాతంలోపు అందుబాటులో ఉందని అధ్యయనాలు చెబుతున్నాయి. వేర్వేరు రవాణా సాధనాల అనుసంధానం ద్వారా ప్రజారవాణాను 2047 నాటికి 70శాతానికి పెంచడం ప్రభుత్వ విజన్. వందశాతం ఎలక్ట్రికల్ బస్సులు క్యూర్ పరిధిలో నడపనున్నారు. మొబిలిటీ కార్డును ఆచరణలోకి తేనున్నారు.

**నడకకు ప్రాధాన్యం..**

నగరంలో సరైన పాదబాటలు లేవు. ప్రజారవాణా వినియోగం తగ్గడానికి ఇదొక కారణమని ప్రయాణికులు వాపోతున్నారు. వీటి దృష్ట్యా కాలిబాటల విస్తరణకు తెలంగాణ రైజింగ్ 2047లో ప్రాధాన్యం కల్పించారు. 1000 కి.మీ. వరకు కాలిబాటలు, సైకిల్ మార్గాల విస్తరణ ప్రణాళికలను పొందుపర్చారు.

# అక్రమ మార్గంలో కుళాయి కనెక్షన్లు

కరీంనగర్: నగరానికి సమీపంలో ఉన్న ఓ విలీన కాలనీలో నల్లా కనెక్షన్ కోసం ఒకరు దరఖాస్తు చేసేందుకు ప్రయత్నించారు. రోజుల తరబడి తిరగాల్సి వస్తోందని తెలియడంతో కింది స్థాయి సిబ్బంది ద్వారా పైరవీలు ప్రారంభించారు. రూ.10 వేలు తీసుకొని నల్లా కనెక్షన్ బిగించారు. 15 రోజుల్లో ఇంట్లోకి నల్లా నీరు వస్తోంది. అదే ప్రాంతానికి చెందిన మరో వ్యక్తి నల్లా కనెక్షన్ కోసం రెండు నెలల కిందట దరఖాస్తు చేశారు. ఏతీరు మట్టు తిరిగినా పట్టించుకోవడంలేదు. ఇప్పటికీ ఎలాంటి స్పందన లేకపోవడంతో డీఈఈ దృష్టికి తీసుకెళ్లారు. అయినా నిర్లక్ష్యంగానే ఉంటున్నారు. అధికారికంగా నల్లా కనెక్షన్ తీసుకోవడానికి ఇంటి యజమానులు ముందుకొస్తే క్షేత్రస్థాయిలో ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది రకరకాల కొర్రీలు పెడుతున్నారు. అదే ప్రైవేటు కార్మికులు ఆ దస్త్రం తీసుకొస్తే వారం రోజుల్లోనే నల్లా మంజూరవుతుంది. పైగా ఆ కార్మికులే నిబంధనలకు విరుద్ధంగా కుళాయి కనెక్షన్లు ఇచ్చి అందినకాడికి దండుకుంటున్నారు. ప్రధానంగా శివారు డివిజన్లతోపాటు ఇటీవల విలీనమైన బొమ్మకల్, చింతకుంట, మల్కాపూర్, దుర్శేడ్, గోపాల్‌పూర్, కొత్తపల్లి ప్రాంతాల్లోని కొన్ని కాలనీల్లో ఈ దందా కొనసాగుతోంది. మెయిన్ లైన్లు ఉన్న చోట్ల కనెక్షన్ ఇచ్చేందుకు భారీ మొత్తంలో డిమాండ్ చేస్తున్నారు.

**పెండింగ్‌లోనే అర్జీలు..**

తెల్ల కార్డుదారులకు రూపాయి, సాధారణ ప్రజలకు రూ.100 చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తున్నారు. ఈ దరఖాస్తులకు రోడ్డు కట్టింగ్



ఛార్జీలు రూ.500, మూడు నెలల ముందస్తు బిల్లు రూ.300 కలిపి తీసుకుంటారు. లైన్‌మెన్, ఫిట్టర్, ఏఈ, డీఈఈ పరిశీలించి రిపోర్టు రాసిన తర్వాత ఫీజు చెల్లిస్తారు. 17 రిజర్వాయర్లు ఉండగా ఒక్కో ట్యాంకు పరిధిలో 40 వరకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. మొత్తం 510 అర్జీలు పరిశీలనలోనే ఉండటంతో దరఖాస్తుదారులు కార్యాలయం, సిబ్బంది చుట్టూ తిరుగుతున్నారు.

**ప్రైవేటు కార్మికులదే హవా**

నల్లా కనెక్షన్‌కు రోడ్డు తవ్వాల్సి ఉండటంతో ప్రైవేటు కార్మికుల పాత్ర తప్పనిసరిగా మారింది. అయితే వీరే పైపులైన్లను, ఇంటికి నల్లా కనెక్షన్ ఇస్తున్నారు. రోడ్డును బట్టి రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు తవ్వేందుకు ఖర్చు అవుతుందని చెబుతున్నారు. గత్యంతరం లేక కొత్తగా కనెక్షన్ తీసుకునే వారు వారినే ఆశ్రయిస్తున్నా రు. నల్లా నంబర్ లేకుండా కనెక్షన్ ఇస్తున్నట్లు ఒక్కొక్కటి బయటకు వస్తున్నాయి.

# చలిలో వేడిగా.. వ్యాధులకు దూరంగా



హైదరాబాద్: రోజురోజుకు నగరంలో చలి తీవ్రత పెరుగుతోంది. చాలా ప్రాంతాల్లో రాత్రి ఉష్ో?గ్రతలు పడిపోతున్నాయి. వైరల్ వ్యాధులు విజ ృంభిస్తున్నాయి. పిల్లల నుంచి పెద్దల వరకు జలుబు, దగ్గు, జ్వరం, ముక్కుకారటం లాంటి ఇబ్బందులతో బాధపడు తున్నారు. న్యుమోనియా, ఇన్‌ఫ్లూయెంజా కేసులు పెరుగుతున్నాయి. ముఖ్యంగా ఈ కాలంలో ఆహార జాగ్రత్తలతో వ్యాధి నిరోధక శక్తి పెంచుకోవచ్చునని వైద్యులు సూచిస్తున్నారు. చలికాలంలో సరైన ఆహారపు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా శరీరాన్ని వెచ్చగా ఉ ంచుకోవడమే కాకుండా సరైన విటమిన్లు, మినరల్స్‌తో వ్యాధి నిరోధక శక్తి పెంపొందించుకోవచ్చునని ఉస్మానియా వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజారావు తెలిపారు.

**సమతుల ఆహారంతో..**

చలి వాతావరణంలో చిరుధాన్యాలతో చేసిన ఆహారం ఎంతో మేలు చేస్తుంది. జొన్న, రాగి, కొర్రలు, సజ్జలు, సామలు, అరికలు, ఊదలతో చేసిన రొట్టెలు, జావ, సూప్స్, చిరుతిళ్లు శరీరానికి కావాల్సిన మిటమిన్లు పుష్కలంగా అందిస్తాయి.

వీటిల్లో ఫైబర్, ఐరన్, కాల్షియం, మెగ్నీషియం, జింక్ అధికంగా ఉ ండటంతో వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయి. ఫైబర్ శాతం ఎక్కువగా ఉండటం వల్ల జీర?శక్తికి సహాయకారిగా ఉండటమే కాకుండా.. మలబద్ధకం సమస్యలను దరి చేరనీయవు. బరువు తగ్గేందుకూ ఉ పయోగపడతాయి.

చిరుధాన్యాల్లో అమైనో ఆమ్లాలు ఆందోళన, కుంగుబాటును తగ్గిస్తాయి. రోజూ అల్పాహారంలో ఏదైనా చిరు ధాన్యంతో చేసిన ఉప్మా, రొట్టె, దోసె, అన్నం రూపంలో తీసుకోవడం మేలని ఎన్‌ఐఎన్ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. మధ్యాహ్నం, రాత్రి భోజనంలో పాలకూర, మెంతికూర, గోంగూర, బ్రోకలీ, క్యాలిఫ్లవర్, క్యారెట్, బీట్‌రూట్‌లాంటి ఆకుకూరలు, కూరగాయలు ఉండేలా చూసుకోవాలి. రోజూ కనీసం 250 గ్రాములు ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల శరీరానికి పుష్కలంగా విటమిన్లు, మినరల్స్, యాంటి ఆక్సిడెంట్లు అందుతాయి.

చలికాలంలో దొరికే పండ్లు నారింజలు, బత్తాయిలు, దానిమ్మ, జామ వంటి పండ్లలో సి-విటమిన్, యాంటి ఆక్సిడెంట్లు వైరల్ వ్యాధుల బారిన పడకుండా కాపాడతాయి. వేడివేడి సూప్‌లు శరీర ఉష్ోగ్రతలను సమతుల్యం చేయడంతోపాటు జలుబు నుంచి ఉపశమనం కల్పిస్తాయి.

# రూ.కోట్లు కుమ్మరింత.. కంపుతో కలవరింత



హైదరాబాద్: తొలుత కూకట్‌పల్లి నాలా వద్ద రసాయన వ్యర్థాలు తొలగించేందుకు సిద్ధమైనా తర్వాత విరమించుకున్నారు. కూకట్‌పల్లి నుంచి అధికస్థాయి పారిశ్రామిక వ్యర్థాలు హుస్సేన్‌సాగర్‌లో చేరుతున్నాయి. ఈ నాలా మళ్లింపు పూర్తిస్థాయిలో జరగలేదు. రూ.50 కోట్లతో భారీ పైపులైన్ నిర్మించినా ఫలితం లేకపోయింది. సాగర్‌లో 4 నాలాలు కలుస్తున్నాయి. వీటి మళ్లింపు పూర్తిస్థాయిలో జరగలేదు. ఇప్పటికీ వ్యర్థ జలాలు వచ్చి చేరుతున్నాయి.

**జలచరాలు బతకలేని పరిస్థితి..** సాగర్ జలాలు అనుకున్న స్థాయిలో మెరుగుపడటం లేదు. బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్(బీవోడీ), డిజాల్వ్‌డ్ ఆక్సిజన్(డీవో) స్థాయిలు మెరుగుపడటంలేదు. బీవోడీ లీటరు నీటిలో 5 ఎంజీలు దాటితే ఎక్కువ కలుషితమైందిగా భావిస్తారు. డీవో లీటర్‌కు 5.6 ఎంజీలుపైగా ఉంటే ప్రమాదకరం. 2 లోపల ఉ ంటే ఆ నీటిలో చేపలు ఇతర జలాచరాలు మనగలవు. ప్రస్తుతం హుస్సేన్‌సాగర్‌లో జలచరాలు బతకలేని పరిస్థితి.

హుస్సేన్‌సాగర్ ప్రక్షాళనతో పాటు పరీవాహక ప్రాంతాల్లో మురుగు శుద్ధి కేంద్రాల నిర్మాణం, నాలాల ప్రక్షాళనకు రూ.వందల కోట్లు ఖర్చు పెట్టినా మెరుగుదల కన్పించడం లేదు. గతంలో తూతూమం త్రంగా పనులతో నిధులు పక్కదారి పట్టించారనే ఆరోపణలున్నాయి. మొత్తం 10 లక్షల మెట్రిక్ టన్నుల బురద తొలగించాలని లక్ష్యంగా పెట్టుకున్నా ఆ స్థాయిలో పనులు జరగలేదు.

మూడు నెలల క్రితం పీసీబీ లెక్కలు తీయగా..ఎన్టీఆర్ ఘాట్ సమీపంలో బీవోడీ 94 ఎంజీ/ఎల్, డీవో 8 ఎంజీ/ఎల్ వరకు ఉంది. భార లోహాలైన లెడ్, కాడ్మియంతోపాటు ఈకోలి బ్యాక్టీరియా హెచ్చుస్థాయిలో ఉంది.

**ఇప్పటివరకు పనులిలా..**

2018-19లో రూ.3 కోట్లు, 2021లో మరో రూ.10 కోట్లతో బయో-రెమిడియేషన్ కోసం ఖర్చు చేశారు. హుస్సేన్‌సాగర్ పరీవాహక ప్రాంతంలో 17 కొత్త ఎస్టీపీలు.. 376.5 ఎంఎల్‌డీ సామర్థ్యంతో నిర్మించారు. ఇందుకు రూ.వెయ్యి కోట్ల వరకు వెచ్చించారు.

తాజాగా హెచ్‌ఎండీఏ బయోరెమిడేషన్ ప్రాజెక్టు కోసం రూ.6 కోట్లతో టెండర్లు పిలిచింది. హుస్సేన్‌సాగర్‌లో ఆక్సిజన్ పెంచడం, దుర్వాసనను నియంత్రించడానికి ఎంజైమ్ సొల్యూషన్లు, పారిశ్రామిక కాలుష్యాన్ని తగ్గించడం, డిజాల్వ్‌డ్ ఆక్సిజన్ స్థాయిలను మెరుగుపరిచేందుకు ఖర్చు చేయనున్నారు.

# భూగర్భ తీగలు..లేదంటే ఏబీ కేబుళ్లు



హైదరాబాద్ : నగరంలో భూగర్భ విద్యుత్తు తీగలు లేదా ఏబీ కేబుల్స్ వేయడానికి అవసరమైన నిధుల సమీకరణపై డిస్కం దృష్టి సారించింది. జీతాలకే ఇబ్బంది పడుతున్న దృష్ట్యా ఇది ఒక్కటే మార్గమని అధికారులు భావిస్తున్నారు. తొలుత మెట్రోజోన్ పరిధిలో భూగర్భ తీగలు వేయడానికి ప్రాధాన్యం ఇస్తారు. సాధ్యం కాని చోట ఏబీ కేబుల్స్ (తొడుగు ఉన్న విద్యుత్తు తీగలు) వేస్తారు. ప్రభుత్వం ఈ ప్రాజెక్టు కోసం రూ.4051 కోట్లతో డీపీఆర్‌కు ఆమోదం తెలిపి పరిపాలనాపరమైన అనుమతి ఇచ్చి డిస్కం అంతర్గత నిధులతో లేదంటే రుణాలు తీసుకుని చేపట్టాలని స్పష్టం చేసింది.

మెట్రో జోన్‌తోపాటు రంగారెడ్డి, మేడ్చల్ జోన్లలో భూగర్భ విద్యుత్తు తీగలు వేయడానికి రూ.14,725 కోట్లు అవుతుందని అంచనా వేశారు. ఇంత పెద్ద మొత్తం ఒకేసారి ఖర్చు చేయడం భారం కాబట్టి తొలుత మెట్రో జోన్ వరకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇక్కడి అనుభవాలను బట్టి మిగతా రెండు జోన్ల పరిధిలోని ఆరు సర్కిళ్లకు విస్తరించే అవకాశం ఉంది. **అంచనా ఇలా..**

ప్రధాన రహదారులపై ఎల్‌టీ ఓవర్‌హెడ్ లైన్లు 825 కి.మీ. ఉన్నాయి. వీటిని భూగర్భలోకి మార్చేందుకు ఖర్చు రూ.149 కోట్లు.

ఇళ్లకు సమీపంలో, ఇరుకు గల్లీల్లో ఎల్‌టీ తీగలు 6251 కి.మీ. వరకు ఉన్నాయి. వాటిని తొలగించి ఏబీ కేబుల్స్ వేయాలని గతంలోనే నిర?యించారు. నిధులు లేక ఈ పనులు పూర్తి కాలేదు. ఇప్పుడు వీటిని ఇందులో చేర్చారు. ఖర్చు రూ.563 కోట్లు.

33 కేవీ తీగలను 180 కి.మీ. మాత్రమే మార్చాల్సి ఉంది. వీటికి వ్యయం రూ.110 కోట్లు.

11కేవీ తీగలు 2395 కి.మీ.వరకు ఉన్నాయి. వీటికి అత్యధికంగా రూ.1430 కోట్లు వెచ్చించాలి.

33కేవీ, 11 కేవీ కలిపి ఉన్నవి 73 కి.మీ. ఉంటే వీటికి రూ.65 కోట్లు, 33/11/ఎల్‌టీ తీగలు కలిపి ఉన్నవి 24 కి.మీ. ఇందుకు ఖర్చు రూ.25 కోట్లు.

11 కేవీ, ఎల్‌టీ తీగలు కలిసి 1407 కి.మీ. ఉన్నాయి. వీటిని భూగర్భలోకి మార్చేందుకు రూ.857 కోట్లు అవసరం.

రింగ్‌మెయిన్ యూనిట్ల వరకు 14051 కి.మీ. తీగలకు రూ.823 కోట్లు అవుతుందని డీపీఆర్‌లో పొందుపరిచారు.

# పక్కలో బల్లెం.. గెలుపుపై కలవరం

బషీరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో చాలామంది అభ్యర్థులకు రెబల్స్ బెడద తప్పడం లేదు. 'నేనూ అదే పార్టీ అభ్యర్థిని.. నాకు మద్దతు ఇవ్వండి'.. అంటూ ప్రచారం చేస్తుండడంతో ఏం చేయాలో పాలుపోవడం లేదు. సర్పంచి, వార్డు సభ్యుల ఎన్నికల్లో పార్టీ గుర్తులు లేకున్నా.. కాంగ్రెస్, భారాస, భాజపా బలపర్చిన అభ్యర్థులు రంగంలోకి దిగారు. వారికి మద్దుతు తెలుపుతూ ఆయా పార్టీల నాయకులు, మద్దతుదారులు ప్రచారం సాగిస్తున్నారు. అదే పార్టీలోని మరికొందరు మద్దతుదారులతో ప్రచారంలో దూసుకెళుతున్నారు. అందరూ పోటాపోటీగా ప్రచారం చేస్తుండడంతో ఎవరికి నష్టం వాటిల్లుతుందో తెలియడం లేదు. రెబల్స్‌తో సొంత పార్టీ ఓట్లు చీలిపోయి ప్రత్యర్థులకు మేలు జరుగుతుందేమోనని చాలా మంది ప్రధాన అభ్యర్థులు భయపడుతున్నారు.

**తలోదిక్కు ప్రచారం..**

జిల్లాలో మొదటి విడత ఎన్నికలు జరుగుతున్న ఎనిమిది మండలాల్లో ఇలాంటి పరిస్థితే నెలకొంది. బషీరాబాద్ మండలంలోని ఓ గ్రామంలో ప్రధాన పార్టీ నుంచి నలుగురు అభ్యర్థులు సర్పంచి పదవికి బరిలో నిలిచారు. అందరూ ఒకే పార్టీలో పనిచేసిన వారే ఉన్నారు. వారంతా తలోదిక్కు ప్రచారం చేసుకుంటున్నారు. ఎవరికివారు మద్దతుదారులను కూడగట్టుకొంటున్నారు. మరో గ్రామంలో ఒకే పార్టీలో టికెట్ కోసం పోటీ పడిన ఇద్దరు ఒకరికొకరు ప్రత్యర్థులయ్యారు. పోటాపోటీగా ప్రచారం చేసుకుంటున్నారు. పార్టీకి చెందిన పెద్ద నాయకులు ఈ గ్రామానికి ప్రచారం కోసం వెళ్లేందుకు సైతం జంకుతున్నారు. ఒకరి వద్దకు వెళితే.. మరికొరికి కోపం వస్తుందని భావిస్తున్నారు. గెలిచాక రావాలంటూ నేతలు ఆ ఇద్దరికీ అంతర్గతంగా చెప్పారని పలువురు అంటున్నారు.

# ట్రాక్టర్లు మూలకు.. పారిశుద్ధ్యం పక్కకు!

గంగాధర : ఈచిత్రంలోని ట్రాక్టర్ గంగాధర మండలం ఒద్యారం గ్రామ పంచాయతీ కార్యాలయానికి చెందింది. ట్రాక్టర్‌లోని బ్యాటరీ, రేడియేటర్, హైడ్రాలిక్, డ్రాబర్ పట్టీలు, ఇంజన్‌లోని పలు భాగాలతోపాటు టైర్లు దొంగలపాలవడంతో చెత్త తొలగించకుండా అలాగే వదిలేశారు. కేవలం డబ్బా మాత్రమే మిగిలి పనికిరాకుండా ఉంది. ట్రాక్టర్ వినియోగంలో లేక టేలర్, నీటి ట్యాంకర్ కూడా నిరుపయోగంగా మారింది. జిల్లా కలెక్టర్, పంచాయతీ అధికారులకు గ్రామస్థులు గతంలో ఫిర్యాదు కూడా చేశారు.

**ఎక్కడి చెత్త అక్కడే..**

పల్లెల్లో చెత్త సేకరించి డంపింగ్ యార్డులకు తరలించేందుకు, హరిత హారంలో నాటిన మొక్కలతోపాటు నర్సరీల్లో మొక్కలకు నీరు పట్టి రక్షించేందుకు కేటాయించిన ట్రాక్టర్లు జిల్లాలోని చాలా పంచాయతీల్లో వినియోగించకుండా మూలకు పడేసినట్లు ఆరోపణలున్నాయి.

పంచాయతీల పాలకవర్గాలు లేక రెండేళ్లు గడవడంతో ప్రత్యేకాధికారుల పాలనలో చిన్న గ్రామాల్లో నిధుల కొరతతో ట్రాక్టర్ల నిర్వహణ భారంగా మారింది. కొన్నిచోట్లయితే వారానికోసారి కూడా చెత్త సేకరణకు ట్రాక్టర్లు తిప్పడం లేదు. ఆదాయ వనరులున్నచోట మాత్రమే అక్కడి సిబ్బంది ట్రాక్టర్లలతో చెత్త తీసుకెళ్తున్నారు. జిల్లాలోని 323 పంచాయతీ



లకు ట్రాక్టర్లను కేటాయించగా కొన్ని చోట్ల మరమ్మతులకు గురయ్యాయి. కొన్ని పంచాయతీల్లో నిధుల కొరతతో డీజిల్ పోయక వదిలేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవ డం, రాష్ట్ర ప్రభుత్వం కూడా మంజూరు చేయకపోవడంతో వీధి దీపాలు, తాగునీటి సరఫరా, మురుగుకాలువల నిర్వహణ ప్రత్యేకాధికా రులకు తలనొప్పిగా మారింది. ఇక ట్రాక్టర్లను తిప్పడం మానేశారు. చొప్పదండి మండలంలోని రాగంపేట, రుక్మాపూర్ పంచాయతీల్లో చెడిపోయిన ట్రాక్టర్లకు ఇటీవల మరమ్మతులు చేయించారు. ఈ నెలలోనే మూడు విడతల్లో గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగి నూతన పాలకవర్గాలు కొలువుదీరనుండగా వారికి ట్రాక్టర్ల నిర్వహణ ఓ సవాల్‌గా మారనుంది. నిరుపయోగంగా ఉన్న ట్రాక్టర్లకు మరమ్మతు లు చేయించి ఎప్పటిలాగే పారిశుద్ధ్యం పక్కాగా అమలు చేయాల్సిన బాధ్యత వారిపై ఉంది. మరి వారు ఏమేరకు సవాల్ స్వీకరిస్తారో చూడాలి.

# కొయ్యలకు నిప్పు.. నేలకు ముప్పు

కొడిమ్యాల: రబీ సీజన్‌లో వరి సాగుకు రైతులు సన్నద్ధమవు తున్నారు. అయితే వరి కోతల అనంతరం పొలంలో మిగిలిపోయిన వరి కొయ్యలను రైతులు అవగాహన రాహిత్యంతో కాల్చివేస్తుండటంతో భూసారానికి అది ముప్పుగా పరిణమిస్తోంది. యంత్రాలు ఎక్కువగా అందుబాటులోకి రానప్పుడు రైతులు వరిని చేతులతో భూమికి దగ్గరగా కోసేవారు. పొలం దున్నినప్పుడు కొయ్యలు త్వరగా భూమిలో కలిసిపోయేవి. కానీ నేడు హార్వెస్టర్ సాయంతో కోతలు చేస్తుండటంతో అది భూమికి సుమారు అడుగు ఎత్తులో వరిని కోస్తుంది. దీంతో వరి కొయ్యలు అలాగే మిగిలిపోతున్నాయి. రైతులు వీటిని సులభంగా తొలగించాలనే ఆలోచనతో కాల్చివేస్తున్నారు. ఇది భూసారాన్ని దెబ్బతీయడంతోపాటు వాయు కాలుష్యానికి దారితీస్తోంది.

**కాల్చివేతతో కలిగే నష్టాలు..**

వరి కొయ్యలు కాల్చడంతో పంట ఎదుగుదలకు ఉపయోగపడే పొటాషియం, నత్రజని, ఫాస్ఫరస్ వంటి పోషకాలు నశించిపోతాయి.

అప్పుడు భూసారం దెబ్బతిని పంట దిగుబడి తగ్గుతుంది

పంట ఎదుగుదలకు ఉపయోగపడే సూక్ష్మజీవులు, కీటకాలు చనిపోయి భూమి సమతుల్యం దెబ్బతింటుంది

నేలలో తేమశాతం తగ్గడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతుంది

కొయ్యలు కాల్చడంతో వాయు కాలుష్యం ఏర్పడుతుంది. ఈ పొగ పీల్చడంతో అనారోగ్యానికి గురయ్యే అవకాశముంది.

ఇలా చేయాలి ర్వెస్టర్ చోదకులకు ముందుగా చెప్పి వరి కొయ్యలు దగ్గరిగా కోసేలా చూడాలి



కోతల అనంతరం కొయ్యలను కాల్చడానికి బదులుగా నేలలోనే కలియదున్నా దున్నిన అనంతరం పొలంలోని నీటిని తొలగించాలి దున్నడానికి ముందు ఎకరానికి సూపర్ ఫాస్పేట్‌ను 30 నుంచి 40 కిలోల చొప్పున చల్లితే దున్నిన అనంతరం కొయ్యలు త్వరగా మురిగిపోయి భూమిలో కలిసిపోతాయి. అప్పుడది సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది.

**రైతులకు అవగాహన కల్పిస్తున్నాం**

వరి కొయ్యలు కాల్చడంతో జరిగే నష్టాలను రైతులకు స్థానిక ఏవో, ఏఈవోల ద్వారా ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. వ్యవసాయ శాస్త్రవేత్తలను సైతం భాగస్వాములను చేస్తున్నాం. అయినప్పటికి రైతులు పూర్తిస్థాయిలో సహకరించడంలేదు. దీనికి ప్రత్యేక చట్టం ఉంటేనే కొయ్యలను కాల్చడం నియంత్రవచ్చునేది నా అభిప్రాయం.

వి.భాస్కర్, జిల్లా వ్యవసాయాధికారి

# నోట్లో పొక్కులు.. జ్వరం

కరీంనగర్ : కరీంనగర్‌లోని ఓ కాలనీకి చెందిన మూడేళ్ల బాలుడి నోట్లో చిన్న బుడగల్లాంటి పొక్కులు ఉండటం గమనించి ఆసుపత్రికి వెళ్లి పిల్లల వైద్యుడికి చూపించారు. ఇది చికెన్ పాక్స్ కాదని, కాక్సాకి వైరస్‌తో ఇలా అవుతుందని భయపడాల్సిన అవసరం లేదని, మందులు రాసి పంపించారు. ఇంటికి తీసుకెళ్లి విశ్రాంతి తీసుకోమని సూచించారు. కరీంనగర్‌లోని ఒక పిల్లల ఆసుపత్రికి రోజు 50 మంది వస్తే.. అందులో అయిదారుగురు ఈ సమస్యతో బాధపడుతున్నట్లు వైద్యులు వివరించారు.

**చిన్న పిల్లలపై 'కాక్సాకి వైరస్' ప్రభావం**

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కాక్సాకి అనే వైరస్ కారణంగా చిన్న పిల్లల్లో చేతులు, కాళ్లు, నోరు భాగంలో బొబ్బల్లా ఏర్పడి జ్వరంతో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. నీ వాతావరణంలో మార్పులతోపాటు చలికాలంలో వైరసుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. పిల్లలు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు ఇతరులకు వ్యాధి సోకే అవకాశముంది. నీ నోట్లో చిన్న, చిన్న బొబ్బల్లాగా ఏర్పడి సాధారణ జ్వరం వస్తోంది. నీ నోటి ద్వారా ఏమి తినలేకపోతారు. లక్షణాలు కనిపించగానే వైద్యుడిని సంప్రదించాలి.

**వ్యాధి బారిన పడితే..**

యాంటీబయోటిక్స్ ఉండవు. లక్షణాల ఆధారంగా పరీక్షించి



అవసరమైన లోషన్ ఇస్తారు.

పిల్లలు ఆహారం తీసుకోవడానికి ఇబ్బంది పడితే చల్లటి ద్రవ పదార్థాలు పట్టించాలి. పిల్లలకు ఉతికిన దుస్తులు వేసి, పరిశుభ్ర ప్రదేశంలో విశ్రాంతి తీసుకునేలా చూడాలి. చేతులు ఎప్పటికప్పుడు హ్యాండ్‌వాష్‌తో శుభ్రం చేసుకోవాలి. తగిన స్థాయిలో ద్రవ పదార్థాలు ఇస్తూ పర్యవేక్షణ చేయాలి. అయిదు నుంచి వారం రోజులకు పైగా విశ్రాంతి ఇవ్వాలి. మిగతా పిల్లలతో దూరంగా ఉంచాలి.

జ్వరంగా ఉంటే పారాసిటమాల్ వాడవచ్చు. బి కాంప్లెక్స్ సిరప్ వంటివి తాగించవచ్చు.

**నిర్లక్ష్యం చేయొద్దు** నోట్లో, కాలు, చేతులపై వచ్చే బొబ్బలు లాంటివి కాక్సాకి వైరస్‌తో వస్తున్నాయి. లక్షణాలు కనిపించిన వారు వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. చికెన్ పాక్స్ అనేది వ్యారి సెల్లా అనే వైరస్‌తో వస్తుంది. చికెన్ పాక్స్ వచ్చిన వారికి బొబ్బలు మొత్తం శరీరంపై వస్తాయి. రెండు వ్యాధి లక్షణాలు కొద్దిగా వేరుగా ఉంటాయి.

– డాక్టర్ పి.రాజేందర్, సీనియర్ పిల్లల వైద్య నిపుణులు

# సర్కారు ఇసుక.. భారంగా ధర

జగిత్యాల: నిర్మాణరంగ అవసరాలు తీరేలా తక్కువ ధరకు ఇసుక అందించేందుకు గత నెలలో జగిత్యాలలో ఇసుక బజార్‌ను ప్రారంభించారు. ఉద్దేశం మంచిదే అయినా బయటి కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తుండటంతో వినియోగదారులు ఆసక్తి చూపడం లేదు. మరోవైపు ఇసుకబజార్ ధరలు చూసి వ్యాపారులు సైతం అధికంగా వసూలు చేస్తుండటం ఇందిరమ్మ లబ్ధిదారులకు భారంగా మారింది.

**1,387 టన్నులే విక్రయం**

జిల్లాకేంద్రంలో నిర్వహిస్తున్న ఇసుక బజార్‌లో టన్నుకు రూ.1400 చొప్పున తీసుకుంటున్నారు. అదనంగా 5 శాతంతో కలిపి రూ.1470 కు చేరుతోంది. ట్రాక్టరుకు అద్దె కూడా వినియోగదారుడే చెల్లించాల్సి ఉంటుంది. ఇసుక ఇంటికి చేరడానికి దాదాపు రూ.7 వేల వరకు అవుతుంది. అదే బయటి వ్యాపారులు రూ.4 వేలకే ఇంటి వద్ద పోసి వెళ్తున్నారు. అధిక ధరతో ఇసుక బజార్‌కు వినియోగదారులు రావడం లేదు. నెల దాటినా కేవలం 1,387 టన్నులు మాత్రమే విక్రయించారు. ఇందిరమ్మ ఇళ్ల అవసరాలకు టన్నుకు రూ.1200 చొప్పున తీసుకుంటున్నారు. అంటే ఇతరుల కంటే కేవలం రూ.200 మాత్రమే తక్కువ కావడం, బయట ఇంతకంటే తక్కువే ఉండటంతో ఇసుక బజార్ నిరుపయోగంగా మారింది.

**వ్యాపారులు పెంచినా వెయ్యి తక్కువే**

గతంలో ప్రభుత్వ ఇసుక రీచ్‌లలో 4.6 టన్నులకు రూ.3830 చొప్పున తీసుకొనేవారు. అప్పట్లో బయట ధర రూ.5 వేలకు పైగా ఉండేది. ఇటీవల భూగర్భ జల వనరుల శాఖ ఇసుక ధరలు పెంచడంతో ఇసుకబజార్ వైపు ఎవరూ రావడం లేదు. ఇటీవలి కాలం వరకు ట్రాక్టరుకు రూ.4 వేలు వసూలు చేసిన ప్రైవేటు వ్యాపారులు ఇసుక బజార్ ధరలు చూసి రూ.4500 నుంచి రూ.5 వేలు వసూలు చేస్తున్నారు. బయట ధరలు పెరిగినా ప్రభుత్వ ధర కంటే రూ.వెయ్యి వరకు తక్కువకు లభిస్తుండటంతో నిర్మాణదారులు ఇసుకబజార్‌కు రావడం లేదు. ప్రభుత్వం స్పందించి ధర తగ్గిస్తేనే లక్ష్యం నెరవేరనుంది.

నిలిచిన ఇళ్ల నిర్మాణాలు

జిల్లాలో ఎక్కడా ఇసుక రీచ్‌లు లేవు. గతంలో ఉన్నా ఇప్పుడు వినియోగించడం లేదు. స్థానికంగా ఇసుక అందుబాటులో లేకపోవటంతో అధిక ధరలు చెల్లించలేక చాలా గ్రామాల్లో నిర్మాణాలు నిలిచిపోయాయి. వాస్తవానికి ఇందిరమ్మ ఇళ్లకు స్థానిక వాగుల నుంచి ఉచితంగా తీసుకునేలా అనుమతినివ్వాలి. అయితే ఇది ఎక్కడా అమలు కావడం లేదు. మరోవైపు ఇటీవల కంకర ధరలు సైతం పెరిగిపోయాయి. గతంలో రూ.3200 చొప్పున ఉండగా ప్రస్తుతం రూ.4 వేల వరకు వసూలు చేస్తున్నారు. కంకర, ఇసుక అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఇందిరమ్మ లబ్ధిదారులు కోరుతున్నారు.

5 శాతం జీఎస్టీ.. అద్దె అదనం

టన్నుకు రూ.1400, 5 శాతం జీఎస్టీతో కలిపి మొత్తం రూ.1,470.

ఇందిరమ్మ ఇళ్లకు టన్నుకు రూ.1200, 5 శాతం జీఎస్టీతో రూ.1,260.

బయటి వ్యాపారుల ధర టన్నుకు రూ.1000. ట్రాక్టరుకు రూ.4 వేల నుంచి రూ.4,500.

ఇసుకబజార్‌లో వినియోగదారుడు ట్రాక్టరు కిరాయి అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.

# కార్పొరేట్‌కు దీటుగా.. వసతుల్లో మేటిగా..!



ఖమ్మం : రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో సకల వసతులు కల్పించి ఆదర్శ(మోడల్) పాఠశాలలుగా తీర్చిదిద్దాలని సర్కారు భావిస్తోంది. నిధుల విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా విడతల వారీగా జిల్లాలోని 15 బడులను ఎంపిక చేసి సెమీ రెసిడెన్షియల్ పాఠశాలలుగా మెరుగుపరచనుంది. మొదటి విడతలో మధిర నియోజకవర్గంలోని ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడు, చింతకాని మండలం నాగులవంచ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, మధిర మండలం మహదేవపురం జడ్పీ ఉన్నత పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. ఇందుకోసం ఒక్కో బడికి ప్రత్యేక అభివృద్ధి నిధి(ఎస్డీఎఫ్) నుంచి రూ.2కోట్లు కేటాయించగా.. ఆయా విద్యాలయాల్లో సమకూర్చాల్సిన వసతులపై అధికారులు ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు.

సమీక్షించి.. ఆదేశాలిచ్చి..ముదిగొండ మండలం గంధసిరిలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ శ్రీజ, డీఈఓ చైతన్య జైనీ, ఎంఈఓతో కలిసి విద్యాశాఖ ప్రగతిపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క గురువారం సమీక్షించారు. ఆదర్శ పాఠశాలల ఎంపికపై చర్చించిన సందర్భంలో బనిగండ్లపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను నమూనా స్కూల్‌గా మార్చాలని అధికారులు ప్రతిపాదించారు. మూడు పాఠశాలలనూ ఎంపిక చేసి ప్రతిపాదనలు రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. మధిర నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో మూడు చొప్పున 15 పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని సూచించారు. నిధుల కొరత దృష్ట్యా తొలుత మూడు పాఠశాలలపై దృష్టిసారించనున్నారు. తరువాత విడతల వారీగా ఎర్రుపాలెం మండలంలోని మీనవోలు, జమలాపురం, మధిర మండలంలోని సిరిపురంతో పాటు మరో తొమ్మిది సర్కారు బడులను ఎంపిక చేయనున్నట్లు తెలిసింది.

**కల్పించే సౌకర్యాలు**

ఎంపికైన ప్రతి స్కూల్‌లో 800 మంది విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో వసతులు కల్పిస్తారు. అధునాతన తరగతి గదులు, ప్రయోగశాల, డిజిటల్ తరగతి గది, డైనింగ్ హాల్, ప్రతి బ్లాక్‌కు ప్రత్యేక మలమూత్రశాలలు, చుట్టూ ప్రహరీ నిర్మించాలి. కాపలాదారును తప్పనిసరిగా నియమించాలి. విద్యార్థులు బడికి వెళ్లి రావటానికి బస్సు సౌకర్యం కల్పించి.. నిర్వహణ బాధ్యతను మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగించే అవకాశం ఉంది. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందించి సెమీ రెసిడెన్షియల్ స్కూల్‌గా తీర్చిదిద్దనున్నారు.

**కన్సల్టెన్సీ సంస్థతో సర్వే**

ఎంపికైన మూడు పాఠశాలల్లో సమకూర్చాల్సిన వసతులపై ఓ కన్సల్టెన్సీ సంస్థ సర్వే చేస్తున్నట్లు తెలిసింది. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎంత, బడి విస్తీర్ణం, క్రీడాప్రాంగణం ఉందా, లేనిపక్షంలో అందుబాటులోని స్థలాలు, తరగతి గదులను పరిశీలిస్తున్నారు. ఒక్కో బడిలో 800 మంది విద్యార్థులు ఉండాలి. సర్కారు బడిని ఆదర్శంగా తీర్చిదిద్ది బస్సు సౌకర్యం కల్పిస్తే.. 'ప్రైవేటు'కు వెళ్లేవారూ మోడల్ స్కూల్‌కు వస్తారని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు.

# బిరబిరా 'దారి'కొస్తోంది!



కరీంనగర్ : కరీంనగర్ : జాతీయ రహదారి విస్తరణ పనుల్లో వేగం పెరుగుతోంది. వరంగల్ నుంచి కరీంనగర్ వరకు 68 కి.మీ పొడవునా నిర్మించే ఈ మార్గం పనులు మరో నాలుగు నెలల వ్యవధిలో పూర్తి కానున్నాయి. గత ఆరు నెలలుగా రోడ్డు నిర్మాణంలో శరవేగం కనిపిస్తోంది. విస్తరణ ప్రక్రియ కొన్నిచోట్ల కొలిక్కి వచ్చింది. రూ.1647 కోట్ల వ్యయంతో ఈ మార్గంపై సాంకేతిక సౌకర్యాలు, ఇతర వసతుల రూపంలో సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మొదలు కరీంనగర్ వరకు కొత్త రూపుతో సిద్ధమవుతోంది.

**78 శాతం పురోగతి..**

ఎప్పటికప్పుడు జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) ఇక్కడి పురోగతిని పరిశీలిస్తోంది. ఇప్పటి వరకు 78 శాతం పనులు పూర్తయినట్లు సంబంధిత శాఖ అధికారులు ఇటీవల కలెక్టరుకు ఇచ్చిన నివేదికలో తెలిపారు. 2026 మార్చి 31 నాటికల్లా పూర్తి చేయనున్నారు. 2023 జులై 16న ఈ మార్గానికి సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తయి కదలిక వచ్చింది. అంతకుముందు ఏడాదిపాటు రెవెన్యూ అధికారులు భూమి సేకరించారు. ఇప్పటికీ అక్కడక్కడ నిర్వాసితుల సమస్యలు కొలిక్కిరావాల్సి ఉంది.

**కొత్త ప్రతిపాదనలు..**

ఒక వైపు నిర్మాణమవుతుండగా, మరో వైపు ప్రజల నుంచి వినతులు అందుతున్నాయి. ఇటీవల ఈదులగట్టెపల్లి వద్ద రోడ్డు ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయని గ్రామస్థులంతా కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఆయన ఎన్‌హెచ్ అధికారులతో మాట్లాడారు. మరో వైపు కొత్తగట్టు వద్ద యూ టర్న్ లేక చాలా దూరం వెళ్లాల్సి వస్తోందనే అక్కడి ప్రజలు తెలిపారు.

నిర్మాణ స్వరూపం..

కరీంనగర్ జిల్లాలో 46 కి.మీ రోడ్డులో 35 కి.మీ పూర్తయింది.

హనుమకొండ జిల్లాలో 22 కి.మీ దారికి 18 కి.మీ వేశారు.

9 పెద్ద వంతెనల్లో 6 కొత్తవి వివిధ నిర్మాణ దశలో ఉన్నాయి.

చిన్నవంతెనలు 20కి అయిదారు మాత్రం చివరి దశలో ఉన్నాయి.

112 బాక్స్ కల్వర్టులు, 77 కూడళ్ల వారధుల్లో కొన్ని ఏర్పాటవ్వాలి.

ఒక ఆర్వోబీ.. ఇంకో చోట ఆర్‌యూబీ పనులు జరుగుతున్నాయి.

ఇరువైపులా 12 చోట్ల బస్‌షెల్టర్లు నిర్మించాలి.

# ఉపాధి కరవై వలసెళ్తున్నారు!

మంథని : స్థానికంగా ఉపాధి లేకపోవడంతో గ్రామానికి చెందిన యువత ముంబాయి, దుబాయి ప్రాంతాలకు వలస వెళున్నారు. రెండేళ్లుగా పార్వతీ బ్యారేజ్ గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదలడంతో మత్స్యకార్మికులకు ఉపాధి దొరకడం లేదు. మంథని మండలం బెస్తపల్లి గ్రామంలో 1083 జనాభా ఉండగా 139 గృహాలు, 300 కుటుంబాలు ఉన్నాయి. గ్రామంలో ఒకే సామాజిక వర్గానికి(గంగపుత్రులు) చెందిన వారు ఉన్నారు. వీరంతా చేపలు పడుతూ ఉపాధి పొందుతుంటారు.

గ్రామంలో భూలక్ష్మిగుట్టచెరువు, పంతులుకుంట చెరువు, నలకుంట చెరువులున్నాయి. వీటిలో నీరు లేకపోవడంతో 50 ఏళ్లుగా ముంబాయి, దుబాయికి ఉపాధి కోసం వలస వెళ్లేవారు. 2020లో పార్వతీ బ్యారేజీ నిర్మాణంతో మత్స్యకారులకు ఉపాధి లభించింది. స్థానికంగా ఉపాధి దొరకడంతో వలసవెళ్లిన వారంతా స్వగ్రామానికి తిరిగొచ్చారు. రెండేళ్లుగా బ్యారేజీలో నీరు నిల్వ చేయకపోవడంతో మత్స్యకారులకు ఉపాధి కరవై మళ్లీ వలస వెళ్తున్నారు.

**గజ ఈతగాళ్లకు ప్రసిద్ధి**

బెస్తపల్లి గ్రామంలో సుమారు 40 మంది గజ ఈతగాళ్లు ఉన్నారు. పుష్కరాల సమయంలో మంథని, కాళేశ్వరం, కోటి లింగాలు, గోదావరి ఖని వంతెన వద్ద వీరు సేవలందిస్తారు. వినాయక నిమజ్జనాలకు వీరి సేవలకు వినియోగిస్తారు.

**చెరువులున్నా నీరు లేదు**

రెండేళ్లుగా బ్యారేజీలో నీరు లేకపోవడంతో ఉపాధి కరవైంది. బ్యారేజీ



నిర్మాణం చేపట్టడంతో అయిదేళ్ల కిందట గ్రామానికి వచ్చాను. చేపలు పడుతూ రోజుకు రూ.1500 వరకు సంపాదించేవాడిని. గ్రామంలో మూడు చెరువులున్నా నీరు లేకపోవడంతో ఉపాధి లేకుండా పోయింది. ప్రస్తుతం నేను వలసవెళ్లలేక ఇంటివద్దే ఉంటున్నాను. – మెడి శంకరయ్య

**బ్యారేజీ గేట్లు ఎత్తొద్దు**

గ్రామ సమీపంలో ఉన్న పార్వతీ బ్యారేజీలో నీరు నిల్వ చేయాలి. గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయడంతో చేపలు లభించక ఉపాధి దొరకడం లేదు. మాకు వ్యవసాయ భూములు లేవు చేపలు వృత్తే ఆధారం. యువత ఇతర గ్రామాలకు భవన నిర్మాణ పనులకు వెళ్తున్నారు. – మెడి సాయికుమార్

# ఇల్లు పీకి.. పందిరేసుకుని..!

బోనకల్లు : రెండు పడక గదుల ఇళ్లు మంజూరయ్యాయని ఉన్న ఇల్లు పీకేసి కొత్త ఇంటికి పునాదులు తీశారు. పునాదులు పూర్తయితే మొదటి బిల్లు వస్తుందని ఆశించారు. బిల్లు వచ్చే సమయానికి రాష్ట్రంలో ప్రభుత్వం మారిపోయింది. బిల్లులు ఆగిపోయాయి. కొత్త ప్రభుత్వం గత ప్రభుత్వం ఇచ్చిన రెండు పడక గదుల ఇళ్ల గురించి పట్టించుకోవడం లేదు. దీంతో ఉన్న ఇల్లు కోల్పోయి.. నూతన ఇల్లు సమకూరక రెండేళ్లుగా ఎండలకు ఎండుతూ.. వానలకు తడుస్తూ లబ్ధిదారులు తాత్కాలిక గుడిసెల్లో, పందిర్ల కింద నివాసం ఉండాల్సిన దుస్థితి నెలకొంది. గత ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసిన లబ్ధిదారులను ప్రస్తుత ప్రభుత్వం పరిగణలోకి తీసుకోకపోవడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

జిల్లాలో 850 మంది రెండు పడకగదుల ఇళ్ల లబ్ధిదారుల పరిస్థితి ఇదే విధంగా ఉంది. రెండు పడక గదుల ఇళ్ల డిజైన్, ఇందిరమ్మ ఇళ్ల డిజైన్ వేరువేరుగా ఉండటంతో వారికి కొత్తగా ఇళ్లు మంజూరు చేయడానికి సాంకేతికంగా సాధ్యపడటంలేదు. ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారు ప్లాట్ చదును చేసి ప్రభుత్వం ఇచ్చిన డిజైన్ ప్రకారం పునాదులు తీయాలి. రెండు పడక గదుల ఇళ్ల లబ్ధిదారులు



ఇప్పటికే పునాదులు పూర్తిచేసి ప్లింత్ బీములు పోసి పది అడుగుల పిల్లర్లు పోయడంతో వాటిని అధికారులు అంగీకరించడం లేదు. ఇల్లు కావాలంటే వాటిని తీసి కొత్త డిజైన్‌లో పునాదులు వేయాలంటున్నారు. ఇప్పటికే లబ్ధిదారులు ఒక్కొక్కరు రూ.లక్ష వరకు ఖర్చు చేశారు. కొందరు స్లాబ్ లెవల్ వరకు కట్టుకున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తమ పరిస్థితి గమనించి పాత విధానంలో రూ.మూడు లక్షల బిల్లు అయినా ఇప్పించాలని, లేదంటే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

వివరాలు ప్రభుత్వానికి పంపాం

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, నిర్మాణాల పరిస్థితిపై పూర్తి నివేదికను ఇప్పటికే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంపాము. ప్రభుత్వం నుంచి త్వరలో ఆదేశాలు వచ్చే అవకాశం ఉంది. రాగానే తగు చర్యలు చేపడతాం. రమాదేవి, ఎంపీడీఓ

**ఎండల్లో ఎండుతూ.. వానలకు తడుస్తూ జీవిస్తున్నాం**

ఇల్లు మంజూరైందని ఉన్న ఇల్లు పీకేసుకున్నాం. పునాదులు తీసి పిల్లర్లు పోసుకున్నాం. పిల్లర్లు పోయగానే బిల్లు ఇస్తామన్నారు. అంతలోనే కొత్త ప్రభుత్వం వచ్చిందని ఆపేశారు. రెండేళ్లు అయినా ఒక్క రూపాయి రాలేదు. మా ఇల్లు పునాదుల్లోనే ఉంది. చిన్న గుడిసెలో కాలం వెళ్లదీస్తున్నాం. ఇప్పటికైనా బిల్లు ఇప్పించి ఇల్లు పూర్తి చేయించాలి. ముంగి రాంబాయి, చిరునోముల


**పాములు, విష పురుగులు వస్తున్నాయి..** ఉన్న ఇల్లు పీకేసి చిన్న గుడిసె వేసుకొని ఉంటున్నాం. దానిలోకి పాములు, విష పురుగులు వస్తున్నాయి. రెండేళ్లు అయినా బిల్లు ఇవ్వడం లేదు. ఎవరి దగ్గరకు వెళ్లి అడిగినా పట్టించుకోవడం లేదు. మా పరిస్థితి గమనించి బిల్లు ఇవ్వాలి. కొత్త ఇల్లయినా మంజూరు చేయాలి. ముంగి రాణి

# రద్దయినా.. డబ్బు రాదేం..!

కోదాడ: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇళ్లు, ఖాళీ స్థలాలు రిజిస్ట్రేషన్ చేసుకుంటాం. రిజిస్ట్రేషన్ చేసే సమయంలో ఆన్‌లైన్ విధానంలో ప్రభుత్వానికి ముందస్తుగా డబ్బులు చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవాలి. ఆ తర్వాత కార్యాలయానికి వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. డబ్బులు చెల్లించి స్లాట్ బుక్ చేసుకున్న తర్వాత వివిధ కారణాల వల్ల రిజిస్ట్రేషన్ ఆగిపోతే నిబంధనల ప్రకారం ప్రభుత్వం నుంచి డబ్బులు తిరిగిరావాలి. కానీ ఆ డబ్బు కొన్నేళ్లుగా రాక రిజిస్ట్రేషన్‌దారులు ఇబ్బందులు పడుతున్నారు. నల్గొండ జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం చుట్టూ తిరిగినా ప్రయోజనం లేదని బాధితులు వాపోతున్నారు. వీరిలో రూ.50 వేల నుంచి రూ.5 లక్షలకు పైగా స్లాట్ కోసం డబ్బులు చెల్లించిన వారూ ఉన్నారు.

కోదాడకు చెందిన ఉదయ్ సాయి గతేడాది మార్చి 3న కోదాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇంటి రిజిస్ట్రేషన్ కోసం రూ.90 వేలు వెచ్చించి స్లాట్ బుక్ చేసుకున్నాడు. కొన్ని సమస్యల కారణంగా రిజిస్ట్రేషన్ చేసుకోలేకపోయాడు. స్లాట్ బుక్ కోసం చెల్లించిన డబ్బులు తిరిగి పొందేందుకు కొన్ని నెలలుగా నల్గొండ, కోదాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాడు. ట్రెజరీలో పెండింగ్ ఉందని అధికారులు చెబుతున్నట్లు బాధితుడు వాపోయాడు.

సూర్యాపేట జిల్లాకు చెందిన మరో వ్యక్తి తన ఖాళీ స్థలం విక్రయించేందుకు స్లాట్ బుక్ చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల సలహా మేరకు స్లాట్‌ను రద్దు చేసుకున్నాడు. స్లాట్ రద్దయినా డబ్బు తిరిగి రాకపోవడంతో ఎక్కడకు వెళ్లాలో తెలియక సతమతమవుతున్నట్లు



బాధితుడు తెలిపాడు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

స్లాట్ బుక్ చేసుకొని రద్దయిన వారి డబ్బులు తిరిగి రావాల్సి ఉంది. పెండింగ్‌లో ఉన్న డబ్బులు వచ్చేలా చర్యలు చేపడతాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆ డబ్బులు వారి అకౌంట్లో జమ చేస్తాం.

రవీందర్, ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్, నల్గొండ

ఉమ్మడి జిల్లా వివరాలు ఇలా..

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు: 15

బాధితుల సంఖ్య: 50

స్లాట్ రద్దుతో రావాల్సిన డబ్బు: రూ.1.62 కోట్లు



# ఒకవైపు సంక్షోభం ఉంటే.. టికెట్ ధర రూ.40వేలా..?

దిల్లీ: ఇండిగో సంక్షోభంపై దిల్లీ హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. అసలు ఈ సంక్షోభం ఎందుకు తలెత్తిందని కేంద్రాన్ని న్యాయస్థానం ప్రశ్నించింది. ఇలాంటి సమయంలో విమాన టికెట్ ధరలు అమాంతం ఎందుకు పెరిగాయని అడిగింది. "ఒకవైపు సంక్షోభం కొనసాగుతుంటే.. దాని నుంచి ప్రయోజనం పొందేందుకు ఇతర విమానయాన సంస్థలకు అనుమతి ఎలా లభించింది. టికెట్ ధర రూ. 40వేల వరకు ఎలా వెళ్లింది..? ఇదంతా ఎలా జరిగింది" అని కోర్టు ప్రశ్నించింది. ఇండిగో వందల సంఖ్యలో సర్వీసుల్ని రద్దు చేయడంతో భారీ సంఖ్యలో ప్రయాణికులు విమానాశ్రయాల్లో చిక్కుకుపోయారు. ఆ ఎఫెక్ట్‌తో ఇతర విమానయాన సంస్థల్లో టికెట్ ధరలు ఆకాశాన్నంటాయి. సాధారణ రోజులతో పోలిస్తే టికెట్ ధరలు దాదాపు రెండు, మూడు రెట్లు పెరగడంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలోనే అత్యంత రద్దీ మార్గాల్లో ఒకటైన ముంబయి–దిల్లీ మధ్య విమాన సర్వీసుల టికెట్ ధరలు అమాంతం పెరిగాయి. ఒక ఎకానమీ టికెట్‌కు రూ.35వేలు వసూలు చేసినట్లు ప్రయాణికులు వెల్లడించారు. సాధారణంగా ఆ మార్గంలో ప్రయాణించేందుకు చివరి నిమిషంలో బుక్ చేసినా.. విమానంలో వెళ్లిరావడానికి రూ.20వేలు ఖర్చవుతాయని పేర్కొన్నారు. ఈ ధరల పెరుగుదలపై కేంద్రం పరిమితులు విధించింది. అయితే ఈ నిర?యం తీసుకోవడంలో ఆలస్యమైందని హైకోర్టు పేర్కొంది. "ఇండిగో సంక్షోభాన్ని పరిష్కరించేందుకు తీసుకున్న చర్యలను అభినందిస్తున్నాం. అయితే ఇక్కడ మా ప్రశ్న ఏంటంటే.. అసలు ఈ పరిస్థితి ఎందుకు వచ్చింది. దీనికి ఎవరు కారణం..? ఇక్కడ ప్రయాణికులు చిక్కుకుపోవడంతో పాటు ఆర్థిక వ్యవస్థకు నష్టం జరిగింది. చిక్కుకుపోయిన ప్రయాణికుల కోసం ప్రభుత్వం చేసిన ఏర్పాట్లు ఏంటి..?" అని న్యాయస్థానం ప్రశ్నించింది. దాంతో ప్రభుత్వం తీసుకున్న చర్యల గురించి అడిషనల్ సొలిసిటర్ జనరల్ కోర్టుకు వెల్లడించారు. ఆ సమాధానంతో న్యాయస్థానం సంతృప్తి చెందలేదు. "సంక్షోభం వచ్చాక మీరు ఆ చర్యలు తీసుకున్నారు. మా ప్రశ్న అదికాదు. అసలు ఆ సమస్య ఎందుకు వచ్చింది..? అప్పటివరకు మీరు ఏం చేస్తున్నారు..? అలాగే పైలట్లు ఎందుకు ఎక్కువ గంటలు పనిచేయాల్సి వస్తుంది..? ఆ సమస్యను పరిష్కరించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు..?" అని కేంద్రాన్ని ప్రశ్నించింది. ఇండిగో తగినంతమంది పైలట్లను నియమించుకోవాలని, ఎఫ్‌డీటీఎల్ నిబంధనలను పాటించాలని ఆదేశించింది. ఇదిలా ఉంటే.. ఇండిగో విమాన సర్వీసుల్లో 10 శాతం కోత విధిస్తున్నామని పౌర విమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. దీనివల్ల ఆ సంస్థ సర్వీసులను స్థిరీకరించవచ్చని, రద్దులను తగ్గించవచ్చని తెలిపారు. ఇది ఇండిగోకు భారీ ఎదురుదెబ్బ అవుతుందని తెలుస్తోంది. ఆ పదిశాతం ఆకాశ–స్పైస్‌జెట్ మొత్తం వాటాకు సమానం కావడం గమనార్హం. ఇండిగో సంక్షోభంతో మార్కెట్లో ఏర్పడిన డిమాండ్‌ను అందిపుచ్చుకొనేందుకు స్పైస్‌జెట్ ప్రయత్నాలు మొదలుపెట్టింది. దాంతో దాని శీతాకాల షెడ్యూల్‌లోకి అదనంగా 100 సర్వీసులు చేర్చనున్నట్లు ప్రకటించింది.



# రూ. వందల కోట్లు దోచుకొని చిన్న దొంగతనం అంటావా?

అమరావతి: హిందువులపై జగన్‌కి ఎంత ద్వేషం ఉందో ఆయన తీరు చూస్తే అర్థమవుతుందని తితిదే బోర్డు సభ్యులు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ధ్వజమెత్తారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పరకామణి చోరీ కేసు విషయంలో భక్తుల మనోభావాలను దెబ్బ తీసే విధంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వామి వారి హుండీ డబ్బులు లెక్కించే క్రమంలో చోరీకి పాల్పడి .. కొన్ని వందల కోట్ల రూపాయలు సంపాదించారని, దానిని చిన్న దొంగతనంగా చూపించేందుకు జగన్ ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. "రూ.వేల కోట్లు దొచుకున్న మీకు.. పరకామణి చోరీ కేసు చిన్నదిగా కనిపించడం సహజమే. జగన్, వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి.. నూటికి నూరు శాతం పరకామణి కేసులో భాగంగా ఉన్నారనేది వాస్తవం. ఒక్కసారి గతానికి వెళ్తే.. వీళ్లు కేసులను ఎలా తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నం చేశారో అందరికీ తెలుస్తుంది. వైఎస్ వివేకా, పరిటాల రవి కేసుల్లో సాక్షులను హతమార్చారు. ఇప్పుడు కూడా అదే విధానం అమలు చేస్తున్నారు. ఎవరైతే వాస్తవాలను నిరూపించేందుకు ప్రయత్నం చేస్తారో.. వారందరినీ వేధించడం, భయపెట్టడం, అవసరమైతే హత్యలు చేస్తున్నారు" అని జ్యోతుల నెహ్రూ ఆరోపించారు.



# గూగుల్ సీఈవోతో లోకేశ్ భేటీ

అమెరికాలో ఏపీ మంత్రి నారా లోకేశ్ పర్యటన కొనసాగుతోంది. శాన్‌ఫ్రాన్సిస్కోలో గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్‌తో ఆయన భేటీ అయ్యారు. విశాఖలో గూగుల్ ఏఐ డేటా సెంటర్ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ప్రతి కుటుంబంలో ఏఐ ప్రొఫెషనల్ ఉండాలనేది చంద్రబాబు విజన్ అని అన్నారు. ఏపీలో గూగుల్ పెట్టుబడి ప్రారంభం మాత్రమేనని చెప్పారు. మార్చిలో గూగుల్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేస్తామన్నారు. డ్రోన్ సిటీలో అసెంబ్లింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఇంటెల్ ఐటీ సీటీవో శేష కృష?పురతోనూ మంత్రి సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఇంటెల్ ఏటీఎంపీ యూనిట్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

అమరావతిలో ఇంటెల్ ఏఐ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలన్నారు. ఎన్ విడియా ప్రతినిధి రాజ్‌మిర్ పురితో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. ఏపీలో ఎన్ విడియా స్మార్ట్ ఫ్యాక్టరీ పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభించాలని కోరారు. భాగస్వామ్య సంస్థలు పెట్టుబడులు పెట్టేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అడోబ్ సీఈవో శంతను నారాయణ్ భేటీ అయ్యారు. ఏపీలో అడోబ్ జీసీసీ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. జూమ్ ప్రెసిడెంట్ శంకరలింగంతో మంత్రి సమావేశమై ఏపీలో జూమ్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని ఆయా సంస్థల ప్రతినిధులు హామీ ఇచ్చారు.



# ప్రజల ఆకాంక్షల మేరకు పథకాల్లో మార్పులు, చేర్పులు జరగాలి

అమరావతి: ప్రజల ఆకాంక్షల మేరకు పథకాల్లో మార్పులు, చేర్పులు జరగాలని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ప్రతి శాఖ చేసిన పనులన్నీ తన వద్ద రికార్డు రూపంలో ఉన్నాయని చెప్పారు. సచివాలయంలో సీఎం అధ్యక్షతన మంత్రులు, కార్యదర్శులు, హెచ్‌వోడీల సదస్సు నిర్వహించారు. వృద్ధిరేటు పెంపునకు తీసుకోవాల్సిన అంశాలు, అమలు ప్రణాళికపై చర్చించారు. ఈ సందరేగా సీఎం మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని దిశానిర్దేశం చేశారు. "అనంతపురం వేరుశనగ రైతులకు దేశంలోనే తొలిసారి ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చాం. ఆ జిల్లాలో కరవు తీర్చేందుకు ఇజ్రాయెల్ సాంకేతికతను పరిశీలించాం. రాయలసీమలో పశువులకు గడ్డి కూడా దొరకని పరిస్థితి ఉండేది. అనంతపురం జిల్లాలో నాణ్యమైన వేరుశనగ పండేలా చర్యలు చేపట్టాం. అన్నా హజారే, రాజేంద్రసింగ్ స్ఫూర్తితో జలసంరక్షణ చేపట్టాం. రాయలసీమలో ఇప్పుడు భూగరజేలాలు పైకి వచ్చాయి. భూగరజేలాలు 3 మీటర్లకు చేరితే ఖర్చుపెట్టే బడ్జెట్ తగ్గుతుంది. సౌరశక్తి వినియోగించుకుంటే విద్యుత్ డిమాండ్ బాగా తగ్గుతుంది. ఈ ఏడాది కరెంట్ ఛార్జీలు పెంచం. దేశంలో ఇండస్ట్రియల్ పార్కులు ఎక్కువగా ఉన్న రాష్ట్రం మనదే" అని చంద్రబాబు అన్నారు.

# రెండు నెలల పాటు పర్వదినాల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు: తితిదే



తిరుమల: డిసెంబరు, వచ్చే ఏడాది జనవరిలో తిరుమల శ్రీవారి ఆలయంలో నిర్వహించనున్న పలు పర్వదినాల నేపథ్యంలో వీఐపీ బ్రేక్ దర్శనాలను ఆయా రోజుల్లో రద్దు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) ప్రకటించింది. శ్రీవారి ఆలయంలో డిసెంబరు 23న (కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం), 29న (వైకుంఠ ఏకాదశి ముందు రోజు), డిసెంబరు 30 నుంచి జనవరి 8 వరకు (వైకుంఠ ద్వార దర్శనాలు), జనవరి 25 (రథ సప్తమి) కారణంగా ఈ పర్వదినాల్లో ప్రొటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేసినట్లు తితిదే ప్రకటనలో పేర్కొంది. పర్వదినాలకు ముందురోజు వీఐపీ దర్శనాలకు సంబంధించి ఎలాంటి సిఫార్సు లేఖలు స్వీకరించబోమని స్పష్టం చేసింది. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని శ్రీవారి భక్తులు దేవస్థానం సిబ్బందికి సహకరించాలని కోరింది.



# పంచాయతీరాజ్‌లో 10 వేల మందికి పదోన్నతులు


మంగళగిరి: పల్లెలే దేశానికి వెన్నెముక అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. మంగళగిరిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఉద్యోగులతో ఆయన మాటామంతీ నిర్వహించారు. ఉద్యోగులు శాఖాపరమైన సమస్యలను పవన్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆయన మాట్లాడారు. "పల్లెల కోసమే పంచాయతీరాజ్ శాఖ తీసుకున్నా. పదేపదే సమీక్షలు నిర్వహించి సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం. పంచాయతీరాజ్ శాఖలో పదోన్నతులు ఇవ్వకపోవడం సరికాదనిపించింది. గత ప్రభుత్వంలో ప్రతి పోస్టుకు, బదిలీకి ఓ రేటు పెట్టారు. ఈ పద్ధతిని పూర్తిగా నిర్మూలించాలని చెప్పాను. పనులు చేసిన కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లుల చెల్లింపు చేయాలని ఆదేశించాను. పంచాయతీరాజ్ అనుబంధ శాఖల్లో 2లక్షల మంది ఉద్యోగులు ఉన్నారు. సీనియారిటీ, సిన్సియారిటీ, పనితీరు ఆధారంగా పదోన్నతులు ఇవ్వాలని అధికారులకు చెప్పా. మంత్రులు, ఎమ్మెల్యేలు సిఫార్సులు కూడా ఆ పరిధిలో ఉంటేనే చెప్పాలని సూచించాను. 10 వేల మందికి పదోన్నతులు కల్పించాం. పదోన్నతి వచ్చిన ఉద్యోగి ఇంట్లో పండుగ వాతావరణం ఉంటుంది. జీతాలు ఇంకా పెరగాలంటే రాష్ట్ర ఆదాయం పెరగాలి. ఆదాయం పెంపుపై అధికారులు దృష్టి పెట్టాలి. శశిభూషణ్‌కుమార్, కృష్ణతేజ, వెంకటకృష్ణ వంటి అధికారుల కృషి ప్రశంసనీయం. నా తండ్రి కూడా ప్రభుత్వ ఉద్యోగే.. అందుకే ఉద్యోగులపై సానుకూల భావన ఉంది" అని పవన్ అన్నారు.

# ఆంధ్రప్రదేశ్‌లో విద్యావిధానం భేష్: కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్



దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో మంచి విద్యా విధానాలు అమలు చేస్తున్నారని కేంద్రవిద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రశంసించారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులతో పాఠశాలలు అభివృద్ధి చేస్తున్నారని కొనియాడారు. బుధవారం రాజ్యసభలో ఆయన మాట్లాడుతూ.. "సీఎస్‌ఆర్ నిధులతో ఏపీలో విద్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం బాగుంది. ఇతర రాష్ట్రాలకు కూడా అలాంటి విధానాలు అవలంభించవచ్చు. ఆంధ్రా మోడల్ బాగుంది, ఇతర రాష్ట్రాలూ మంచి సృజనాత్మక విధానాలు అవలంభిస్తున్నాయి. ఏపీలో నాణ్యమైన విద్యా విధానం అమల్లో చంద్రబాబు, లోకేశ్ చొరవ బాగుంది" అని కితాబిచ్చారు.

# తిరుమల పరకామణి చోరీ కేసు.. చట్ట ప్రకారం చర్యలకు హైకోర్టు ఆదేశం




అమరావతి: తిరుమల పరకామణి చోరీ కేసులో హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకునేందుకు సీఐడీ, ఏసీబీ డీజీలకు హైకోర్టు వెసులుబాటు కల్పించింది. పరకామణి కేసు లోక్ అదాలత్ వద్ద రాజీ వ్యవహారం, నిందితుడు రవికుమార్ ఆస్తులపై దర్యాప్తును కొనసాగించాలని ఆదేశించింది. ఈ కేసులో సమాచారాన్ని పరస్పరం పంచుకోవాలని సీఐడీ, ఏసీబీ డీజీలకు సూచించింది. తితిదే మాజీ ఏవీఎస్‌వో సతీష్ శవపరీక్ష నివేదికను సీల్డు కవర్‌లో రిజిస్ట్రార్ జ్యుడీషియల్‌కు అందించాలని సీఐడీని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. కేసు దర్యాప్తులో భాగంగా ఐటీ, ఈడీతో సమాచారం పంచుకోవలని స్పష్టం చేసింది. సీఐడీ, ఏసీబీ డీజీలు ఇచ్చిన నివేదికలు పరిశీలించిన తర్వాత హైకోర్టు ఈమేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను ఉన్నత న్యాయస్థానం ఈనెల 16కు వాయిదా వేసింది.


# జంట హత్యల కేసు.. మాచర్ల కోర్టులో లొంగిపోనున్న పిన్నెల్లి సోదరులు



రామకృష్ణారెడ్డి    వెంకటరామిరెడ్డి

పల్నాడు: జంట హత్యల కేసులో వైకాపా మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు పిన్నెల్లి వెంకటరామిరెడ్డిలు గురువారం మాచర్ల కోర్టులో లొంగిపోనున్నారు. పల్నాడు జిల్లాలో ఈ ఏడాది మే 24న తెదేపా నాయకులు జె.వెంకటేశ్వర్లు, జె.కోటేశ్వరరావు హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసులో తమ ముందస్తు బెయిల్‌ను కొట్టేస్తూ ఏపీ హైకోర్టు ఆగస్టు 29న ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ పిన్నెల్లి సోదరులు దాఖలు చేసిన పిటిషన్లను ఇటీవల సుప్రీంకోర్టు కొట్టేసింది. రెండు వారాల్లోపు లొంగిపోవాలని ఆదేశించింది.

# నాలుగేళ్ల చిన్నారికి స్క్రబ్ టైఫస్ పాజిటివ్




విజయనగరం: గజపతినగరం ఏరియా ఆసుపత్రిలో స్క్రబ్ టైఫస్ కేసు నమోదైంది. బొండపల్లి మండలం మరువాడ గ్రామానికి చెందిన నాలుగేళ్ల చిన్నారికి మూడు రోజులుగా జ్వరం తగ్గకపోవడంతో ఏరియా ఆసుపత్రిలో స్క్రబ్ టైఫస్ టెస్ట్ చేశారు. రిపోర్టులో పాజిటివ్ వచ్చినట్లు వైద్యులు తెలిపారు.

ర్యాపిడ్ టెస్ట్, ఎలీసా టెస్ట్‌లో కూడా పాజిటివ్ వచ్చిందని గజపతినగరం ఏరియా ఆసుపత్రి వైద్యాధికారి ప్రవీణ్ చెప్పారు. దీంతో మరువాడ గ్రామంలో అధికారులు క్లోరినేషన్‌ను చేపట్టారు.

# నెల్లూరు మేయర్‌పై అవిశ్వాస తీర్మానం.. వైకాపా నేతల ప్రలోభాలు, బెదిరింపులు

నెల్లూరు: నెల్లూరు మేయర్ పొట్లూరి స్రవంతిపై అవిశ్వాస తీర్మానానికి సంబంధించి ఈ నెల 18న కౌన్సిల్ సమావేశం జరగనుంది. ఈ నేపథ్యంలో తెదేపా కార్పొరేటర్లను వైకాపా నేతలు ప్రలోభపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఈ విషయాన్ని కార్పొరేటర్లు మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్లారు. ప్రలోభాలను మంత్రి నారాయణ, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సీరియస్‌గా తీసుకున్నారు. బెదిరింపులకు పాల్పడిన వారి సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్పొరేటర్లను బెదిరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు.



## మ్యాక్సీ డ్రెస్ లో మెస్మరైజ్ చేస్తున్న దీపిక.. ఖరీదు తెలిస్తే షాక్!

సాధారణంగా సెలబ్రిటీలు లగ్జరీ లైఫ్ ను అనుభవిస్తారన్న విషయం అందరికీ తెలిసిందే. అయితే అందులో భాగంగానే ఎప్పటికప్పుడు తమ కారు కలెక్షన్స్ , వాడే వస్తువుల కలెక్షన్ తో అందరినీ ఆశ్చర్యపరచడమే కాకుండా తాము ధరించే దుస్తులతోనే కాదు వాటి ధరలతో కూడా అందరినీ ఆశ్చర్యపరుస్తూ ఉంటారు. ఈ క్రమంలోనే బాలీవుడ్లో అగ్ర కథానాయకగా పేరు సొంతం చేసుకొని.. ఇప్పుడు తెలుగు చిత్రాలలో కూడా నటించి పాన్ ఇండియా హీరోయిన్గా పేరు సొంతం చేసుకున్న దీపికా పదుకొనే కూడా ఆ జాబితాలోకి చేరిపోయింది. ఎప్పటికప్పుడు ట్రెండీ ఔటిఫిట్ తో దర్శనం ఇచ్చే ఈ ముద్దుగుమ్మ తాజాగా మరో మ్యాక్సీ డ్రెస్ ధరించి అభిమానులను సర్ప్రైజ్ చేసింది. ఇక్కడ మరో ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. ఈ డ్రెస్ ఖరీదు తెలిసి అభిమానులే కాదు నెటిజన్స్ కూడా ఆశ్చర్యపోతున్నారు. డ్రెస్ తో పాటు ఆమె చేతిలో పట్టుకున్న బ్యాగ్ ఖరీదు కూడా అందరిని ఆశ్చర్యపరుస్తోంది. మరి లగ్జరీ మెయింటైన్ చేస్తున్న దీపిక.. తాజాగా తను వేసుకున్న డ్రెస్, పట్టుకున్న బ్యాగ్ ఖరీదు ఎంతో ఇప్పుడు చూద్దాం దీపికా పదుకొనే తాజాగా మాగ్డా బుట్రిమ్ హై నెక్ బ్రౌన్ కలర్ మ్యాక్సీ డ్రెస్ ధరించింది. వింటేజ్ స్టైల్ లో ఓవర్ సైజ్డ్ లెదర్ జాకెట్ తో స్టైల్ చేసింది. ఈ మ్యాక్సీ డ్రెస్ ఖరీదు అక్షరాలా రూ.1,80,600. అలాగే తన చేతిలో లూయిస్



విట్టన్ సైడ్ ట్రంక్ బ్యాగును ధరించింది. దీని విలువ అక్షరాలా రూ.3,50,000. ముఖ్యంగా ఈ బ్యాగు ఆమెకు ఒక క్లాసిక్ రిచ్ లుక్కును అందిస్తోంది అని చెప్పవచ్చు. ఇక బ్లాక్ కలర్ హై హీల్డ్ బూట్లు ధరించిన ఈమె బంగారు వర?ం కలిగిన బ్రాస్ లెట్ లతో తన మేకోవర్ ను ఫుల్ ఫిల్ చేసింది. ముఖ్యంగా ఆకట్టుకుంటున్న చెవి దిద్దులు మరింత హైలెట్గా నిలిచాయి. అంతేకాదు లూజ్ హెయిర్ తో తన అందాన్ని మరింత రెట్టింపు చేసుకుంది ఈ ముద్దుగుమ్మ. ఇక దీపిక పదుకొనే తన ఇన్స్టాగ్రామ్ ఖాతా ద్వారా షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. ఇవి చూసిన నెటిజెన్స్ దీపిక లగ్జరీకి ఈ వస్తువులే నిదర్శనం అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఇక దీపిక విషయానికి వస్తే.. బాలీవుడ్ బ్యూటీగా పేరు సొంతం చేసుకున్న ఈమె వరుస సినిమాలు చేస్తూ బాలీవుడ్ లో అత్యధిక రెమ్యూనరేషన్ తీసుకుంటున్న హీరోయిన్గా పేరు సొంతం చేసుకుంది. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో కల్కి 2898%ూణ% చిత్రంతో తెలుగు ప్రేక్షకులను పలకరించిన ఈమె.. కల్కి సీక్వెల్ నుండి తప్పుకొని విమర్శలు ఎదుర్కొంది. అలాగే స్పిరిట్ నుండి సందీప్ రెడ్డి వంగా ఈమెను తప్పించడంతో ఈ విషయం మరింత హాట్ టాపిక్ గా మారిన విషయం తెలిసిందే. ఇప్పుడు బాలీవుడ్లో పలు సినిమాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ఈమె తాజాగా అట్లీ, అల్లు అర్జున్ కాంబినేషన్లో వస్తున్న సినిమాలో హీరోయిన్గా నటిస్తోంది.

## రామ్ పై భాగ్యశ్రీ ఆసక్తికర కామెంట్స్.. చూసి నేర్చుకోండయ్యా!

ప్రముఖ యంగ్ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. తన నటనతో, అందంతో మెప్పిస్తున్న ఈ ముద్దుగుమ్మ.. రామ్ పోతినేనితో కలిసి ఇటీవల ఆంధ్ర కింగ్ తాలూకా అనే సినిమాలో నటించింది. అలా నవంబర్ 27న విడుదలైన ఈ సినిమా మంచి టాక్ సొంతం చేసుకుంది. ఇదిలా ఉండగా మరొకవైపు ఈ సినిమా షూటింగ్ ఎప్పుడైతే మొదలు పెట్టారో అప్పటి నుంచే రామ్ పోతినేనితో రిలేషన్ లో ఉన్నట్లు పెద్ద ఎత్తున ఎఫైర్ రూమర్స్ కూడా వినిపించాయి. అయితే అవన్నీ పుకార్లు అంటూ కొట్టిపారేసింది. అయితే ఇప్పుడు తాజాగా రామ్ పోతినేని పై చేసిన కామెంట్లు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. ఇకపోతే ఆంధ్ర కింగ్ తాలూకా సినిమా మంచి టాక్ అందుకోవడంతో ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన థ్యాంక్స్ మీట్ లో భాగ్యశ్రీ రామ్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకుంది. భాగ్యశ్రీ మాట్లాడుతూ..” రామ్ ఎప్పుడు కూడా చాలా పాజిటివ్ గానే ఆలోచిస్తాడు. రామ్ ఎక్కడ ఉ



ంటే అక్కడ పాజిటివ్ ఎనర్జీ ఉంటుంది. ముఖ్యంగా సెట్స్ లో కూడా రామ్ పాజిటివ్ ఎనర్జీని తీసుకొచ్చాడు. ఆయన నుంచి నేను ఎన్నో విషయాలు నేర్చుకున్నాను” అంటూ భాగ్యశ్రీ తెలిపింది. ప్రస్తుతం ఈమె చేసిన కామెంట్లు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. ఈ కామెంట్స్ విన్న నెటిజన్స్.. కొంతమంది సెలబ్రిటీలు ప్రతి చిన్న విషయానికి చిరాకు పడుతూ ఉంటారు.. రామ్ ని చూసి నేర్చుకోండయ్యా అంటూ కామెంట్లు చేస్తున్నారు. మొత్తానికి అయితే రామ్ పై భాగ్యశ్రీ చేసిన ఈ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. భాగ్యశ్రీ విషయానికి వస్తే.. పూణే నగరానికి చెందిన ఈమె మోడల్ గా కెరియర్ ను మొదలుపెట్టింది. ఆ తర్వాత నటిగా మారిన భాగ్య శ్రీ 2003లో వచ్చిన హిందీ చిత్రం యారియాన్ 2 అనే సినిమాతో అరంగేట్రం చేసింది. తర్వాత ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్, మాస్ మహారాజా రవితేజ కాంబినేషన్లో 2024 లో విడుదలైన తెలుగు సినిమా మిస్టర్ బచ్చన్ లో హీరోయిన్ గా నటించి మెప్పించింది. అలాగే ఈ సినిమాలో తన పాత్రకు తానే స్వయంగా డబ్బింగ్ చెప్పుకుంది కూడా. నైజీరియాలోని లాగోస్ లో చదువుకున్న ఈమె.. ఇండియా తిరిగి వచ్చి బిజినెస్ మేనేజ్మెంట్లో డిగ్రీలో చేరింది. ఆ సమయంలోనే మోడలింగ్ ను కెరీర్ గా ఎంచుకొని ఒక ఏజెన్సీ తో కలిసి పని చేసింది. అంతేకాదు పలు బ్రాండ్లకు అంబాసిడర్ గా వ్యవహరించిన ఈమె.. క్యాడ్బరీ డైరీ మిల్క్ సిల్క్ యాడ్ తో మరింత పాపులారిటీ సొంతం చేసుకుంది. మిస్టర్ బచ్చన్ తర్వాత కింగ్డమ్ లో నటించిన ఈమె.. అలాగే తమిళ చిత్రం కాంత లో కూడా నటించింది. ఇప్పుడు ఆంధ్ర కింగ్ తాలూకాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది.




## 2026 సంక్రాంతి రేస్.. ఆ ఒక్కటే సరిపోదు..



2026 సంక్రాంతి సీజన్ టాలీవుడ్ కు ఒక రియల్ టెస్ట్ లా మారబోతోంది. ఏకంగా ఐదు తెలుగు సినిమాలు బాక్సాఫీస్ బరిలో దిగుతుండటం మామూలు విషయం కాదు. అయితే గతంలో లాగా కేవలం హీరోల కటౌట్లు చూసి జనం థియేటర్లకు వస్తారా లేదా అనేది సందేహమే. ఆడియెన్స్ మైండ్ సెట్ మారింది. అందుకే ఈసారి పోటీలో ఎవరు గెలుస్తారనేది పూర్తిగా కంటెంట్ మీదే ఆధార పడి ఉంటుంది. స్టార్ పవర్ ఓపెనింగ్స్ ఇస్తుందేమో కానీ, లాంగ్ రన్ మాత్రం కథలోని దమ్ము మీదే డిపెండ్ అవుతుంది. అందరి ఫోకస్ నేచురల్ గానే రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న 'ది రాజా సాబ్' మీదే ఉంది. పాన్ ఇండియా స్టార్ కాబట్టి అంచనాలు స్కై రేంజ్ లో ఉంటాయి. అయితే ఇక్కడ ఫ్యాన్స్ లోనూ, ట్రేడ్ లోనూ ఉన్న చిన్న డౌట్ ఏంటంటే.. డైరెక్టర్ మారుతి ఎగ్జిక్యూషన్ ఎలా ఉంటుందనేది. వింటేజ్ ప్రభాస్ ను చూపిస్తానని మారుతి చెబుతున్నా, ఆ స్కేల్ ని ఆయన ఎలా హ్యాండిల్ చేశారనే దానిపైనే సినిమా రిజల్ట్ ఉంటుంది. మారుతి గనక మ్యాజిక్ చేస్తే రికార్డులు బద్దలవ్వడం ఖాయం. ఇక మెగాస్టార్ చిరంజీవి 'మన శంకర వరప్రసాద్ గారు' విషయంలో స్ట్రాటజీ చాలా క్లియర్ గా కనిపిస్తోంది. అనిల్ రావిపూడి ఎప్పటిలాగే తన ఫేవరెట్ సేఫ్ జోన్ అయిన కమర్షియల్ ఫ్యామిలీ ఆడియెన్స్ ని టార్గెట్ చేశారు. పండగకి ఫ్యామిలీస్ థియేటర్లకు క్యూ కడతారనేది నిజమే. కానీ, ఇన్ని ఆప్షన్స్ ఉన్నప్పుడు కేవలం ఆ జానర్ అడ్వాంటేజ్ మాత్రమే సరిపోదు. స్క్రీన్ ప్లే చాలా గ్రిప్పింగ్ గా ఉంటే తప్ప, మిగతా స్టార్స్ కాంపిటీషన్ ని తట్టుకుని ఈ సినిమా సర్వైవ్ అవ్వడం కష్టం. మరోవైపు రవితేజ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' పరిస్థితిని ప్రాక్టికల్ గా అనలైజ్ చేస్తే.. ఆన్ పేపర్ మిగతా సినిమాలతో కంపేర్ చేస్తే ఇది కొంచెం వీక్ గానే అనిపిస్తోంది. టైటిల్ పరంగా గానీ, బజ్ పరంగా గానీ ఇంకా పీక్స్ కి వెళ్ళలేదు. కానీ రవితేజను మనం తక్కువ అంచనా వేయలేం. ఆయనకు పర్ఫెక్ట్ కంటెంట్ దొరికితే సీన్ మొత్తం మార్చేస్తారు. కంటెంట్ స్ట్రాంగ్ గా ఉంటే ఈ సంక్రాంతికి ఈ సినిమానే గేమ్ ఛేంజర్ అయ్యే ఛాన్స్ ఉంది. యంగ్ హీరోల సినిమాల విషయానికి వస్తే.. 'అనగనగా ఒక రాజు' సక్సెస్ భారం మొత్తం నవీన్ పొలిశెట్టి మీదే ఉంది. ఇది పూర్తిగా వన్ మ్యాన్ షో. ఆయన కామెడీ టైమింగ్, పర్ఫార్మెన్స్ క్లిక్ అయితేనే సినిమా నిలబడుతుంది. ఇక శర్వానంద్ 'నారీ నారీ నడుమ మురారి' కూడా రేసులో ఉన్నప్పటికీ, ఇప్పటి వరకు దీనిపై అఫీషియల్ గా పెద్ద బజ్ క్రియేట్ అవ్వలేదు. ప్రమోషన్స్ విషయంలో టీమ్ అర్జెంట్ గా గేర్ మార్చాల్సిన అవసరం ఉంది. ఫైనల్ గా 2026 సంక్రాంతి బాక్సాఫీస్ ఫైట్ ఈసారి చాలా కొత్తగా ఉండనున్నట్లు తెలుస్తోంది. భారీ అంచనాలు ఉన్న సినిమాలు డిజప్పాయింట్ చేయొచ్చు, అంచనాలు లేని సినిమాలు బ్లాక్ బస్టర్ అవ్వొచ్చు. అంతిమంగా ఆడియెన్స్ ని ఎంగేజ్ చేసే సాలిడ్ కంటెంట్ ఉన్న సినిమానే విన్నర్ గా నిలుస్తుంది. స్టార్ డమ్ కంటే కంటెంటే ఈసారి డిసైడింగ్ ఫ్యాక్టర్ కానుంది. చూడాలి మరి కంటెంట్ పరంగా బాక్సాఫీస్ వద్ద ఎవరు విన్ అవుతారో..!

## రాజా సాబ్ కు ఆర్థిక సమస్యలా?.. విశ్వప్రసాద్ ఏమన్నారంటే?




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, డైరెక్టర్ మారుతి కాంబినేషన్ లో ది రాజా సాబ్ మూవీ రూపొందుతున్న విషయం తెలిసిందే. హారర్ కామెడీ థ్రిల్లర్ గా తెరకెక్కుతున్న ఆ సినిమాను ప్రముఖ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి కానుకగా విడుదల చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. జనవరి 9వ తేదీన మూవీ వరల్డ్ వైడ్ గా పాన్ ఇండియా రేంజ్ లో విడుదల కానుండగా.. కొన్ని గంటలుగా సినిమా రిలీజ్ పై ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి. రీసెంట్ గా బాలయ్య అఖండ 2 తాండవం మూవీ పోస్ట్ పోన్ అవ్వడంతో రాజా సాబ్ కూడా సంక్రాంతికి వచ్చే అవకాశం లేదని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అంతే కాదు.. ఆ సినిమా మేకర్స్ కు కూడా ఆర్థిక సమస్యలు ఉన్నాయంటూ రూమర్స్ స్ప్రెడ్ చేస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ కూడా బాలీవుడ్ నిర్మాణ సంస్థకు డబ్బులు పెండింగ్ ఉందంటూ పోస్టులు పెడుతున్నారు. దీంతో నిర్మాత విశ్వప్రసాద్.. ఇప్పుడు స్పందించారు. రూమర్స్ పై రెస్పాండ్ అవుతూ పోస్ట్ ద్వారా క్లారిటీ ఇచ్చారు. “విడుదలకు ముందే సినిమాలు ఆగిపోవడం, అది పరిశ్రమలోని వివిధ రంగాలపై చూపే ప్రభావం దురదృష్టకరం. చిన్న చిత్రాల నిర్మాతలు తమ మూవీలను పెద్ద సినిమాల ప్రకారం ప్లాన్ చేసుకుని.. ఇప్పుడు వేచి ఉండటం నన్ను తీవ్రంగా కలవరపెట్టింది” అంటూ విశ్వప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. “చివరి నిమిషంలో సినిమా విడుదలకు అంతరాయం కలిగించడానికి ప్రయత్నించడం చాలా దురదృష్టకరం. ఇటువంటి చర్యలను తీవ్రంగా ఖండించాలి. అంతరాయాలు ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు, నిర్మాతలు, సాంకేతిక నిపుణులు సహా వేలాది మంది జీవనోపాధిని ప్రభావితం చేస్తాయి. అందుకే దాన్ని ఖండించాల్సిందే'' అని చెప్పారు. ''చివరి నిమిషంలో అంతరాయాలను నివారించడానికి థర్డ్ పార్టీ వ్యక్తులు విషయంలో స్పష్టమైన చట్టపరమైన మార్గదర్శకాలు రూపొందించడం చాలా ముఖ్యం. బాధ్యతారహిత ప్రయత్నాలపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలి” అని తెలిపారు. ప్రస్తుతం రాజా సాబ్ మూవీ చుట్టూ.. దాన్ని రిలీజ్ చుట్టూ అనేక ఊహాగానాలు ఉన్నాయని అన్నారు. అయితే రాజాసాబ్ మేకింగ్ కు తీసుకున్న ఫైనాన్స్ పూర్తిగా క్లియర్ అయిందని, వడ్డీలు కూడా అనుకున్నదాని కంటే ముందుగానే క్లియర్ చేస్తామని చెప్పారు. రాజా సాబ్ తో పాటు వస్తున్న అన్ని సంక్రాంతి రిలీజ్ చిత్రాలు ఇబ్బందులు లేకుండా విడుదల కావాలని ఆకాంక్షించారు. అన్ని సినిమాలు కూడా ఘన విజయం సాధించాలని కోరుతున్నట్లు ట్వీట్ చేశారు.

## లెక్చరర్ తో హీరోయిన్ స్టోరీ.. ఎగ్జామ్ పేపర్స్ లీక్

సాధారణంగా సినిమా ప్రమోషన్స్ లో నటీనటులు తమ పాత్రల గురించి లేదా షూటింగ్ విశేషాల గురించి చెబుతుంటారు. కానీ కొన్నిసార్లు ఫ్లోలో నోరు జారి లేదా కావాలనే బోల్డ్ గా మాట్లాడి సంచలనం సృష్టిస్తుంటారు. లేటెస్ట్ గా హీరోయిన్ రాశీ సింగ్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారాయి. మాస్ మూవీ మేకర్స్ బ్యానర్ పై ఎస్కేఎన్ నిర్మించిన 'త్రీ రోజెస్' సీజన్ 2 వెబ్ సిరీస్ ప్రమోషన్స్ లో ఆమె పాల్గొంది. ఈషా రెబ్బా, కుషిత కల్లపులతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకుంటున్న రాశీ, డిసెంబర్ 12న 'ఆహా'లో స్ట్రీమింగ్ కానున్న ఈ సిరీస్ కోసం ఇంటర్వ్యూలు ఇస్తూ తన పర్సనల్ లైఫ్ సీక్రెట్ ను బయటపెట్టి అందరినీ ఆశ్చర్యపరిచింది. రాశీ సింగ్ తన గతం గురించి మాట్లాడుతూ.. స్కూల్ డేస్ అయిపోయాక జస్ట్ కాలేజీలో అడుగుపెట్టిన కొత్తలోనే తనకో బాయ్ ఫ్రెండ్ ఉండేవాడని చెప్పింది. అయితే ఆ వ్యక్తి మరెవరో



కాదు, స్వయంగా ఆమెకు పాఠాలు చెప్పే యంగ్ లెక్చరర్ అట. అప్పుడు తన వయసు కేవలం 17 ఏళ్లు మాత్రమేనని, ఆ లెక్చరర్ కూడా అప్పుడు చాలా యంగ్ గా ఉండేవారని, ఇంకా పెళ్లి కాలేదని రాశీ తెలిపింది. స్టూడెంట్ లెక్చరర్ మధ్య ఫన్నీ థింగ్స్ నడిచిందనే విషయం ఇప్పుడు నెట్టింట చర్చనీయాంశమైంది. అసలు ట్విస్ట్ ఏంటంటే.. అతని వల్ల రాశీ సింగ్ కు కాలేజీలో క్వశ్చన్ పేపర్లు ముందే చేతికి వచ్చేవట. ఆయన స్పెషల్ గా తన కోసం పేపర్స్ లీక్ చేసేవారని ఆమె ఓపెన్ గానే ఒప్పుకుంది. ఇది విన్న %ాఖచీ% తో పాటు అక్కడున్న వారంతా షాక్ అయ్యారు. అంతేకాదు, ప్రాక్టికల్ ఎగ్జామ్స్ లో వైవా రూమ్ లోకి వెళ్తే.. ఆ లెక్చరర్ ఆమెను ఒక్క సబ్జెక్ట్ క్వశ్చన్ కూడా అడిగేవారు కాదని, కేవలం ఒక పది నిమిషాల పాటు కూర్చుని సరదాగా కబుర్లు చెప్పుకుంటూ టైమ్ పాస్ చేసేవారని ఆమె నవ్వుతూ చెప్పింది. అయితే లెక్చరర్ తో రిలేషన్ అనగానే ఇంకేదో ఊహించుకోవద్దని, తమ మధ్య అప్పుడు ఏమీ జరగలేదని రాశీ సింగ్ క్లారిటీ ఇచ్చింది. అదొక బాండ్ అని “ఏం జరగలేదు” అని ఆమె పదే పదే చెప్పడం కొసమెరుపు. ప్రస్తుతం ఆ లెక్చరర్ కు పెళ్లయిందని, విశేషం ఏంటంటే ఇప్పటికీ ఆయన తనను ఇన్ స్టాగ్రామ్ లో ఫాలో అవుతుంటారని చెప్పింది. ఇంకా విచిత్రం ఏంటంటే.. ఆయన భార్య కూడా రాశీని ఫాలో అవుతుందట. ఇక 'త్రీ రోజెస్ 2' సిరీస్ లో ఎంత బోల్డ్ కంటెంట్ ఉందో తెలియదు కానీ, ప్రమోషన్స్ లో మాత్రం రాశీ సింగ్ తన బోల్డ్ కామెంట్స్ తో హీట్ పెంచేసింది. డిసెంబర్ 12న రాబోతున్న ఈ సిరీస్ లో ఇంకెన్ని ట్విస్టులు ఉంటాయో చూడాలి.

## ఆ తప్పులను ఇప్పటికీ మర్చిపోలేకపోతున్నా...

జీవితంలో మనిషి అన్నాక తప్పనిసరిగా ఏదో ఒక సందర్భంలో తెలిసో తెలియకో తప్పులు చేస్తూ ఉంటారు. అయితే వాటిని సరిదిద్దుకోవడానికి ప్రయత్నం చేసినప్పుడే జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకుంటాం అని ఇప్పటికే ఎంతోమంది నిరూపించారు కూడా. అలాంటి వారిలో సౌత్ లేడీ సూపర్ స్టార్ నయనతార కూడా ఒకరు. తెలుగు, తమిళ్ భాషా చిత్రాలలో నటిస్తూ తన నటనతో భారీ పాపులారిటీ అందుకున్న ఈమె.. ఇండస్ట్రీకి వచ్చి 20 ఏళ్లు అవుతున్నా.. ఇంకా స్టార్ హీరోయిన్ గానే బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తూ అందరి దృష్టిని ఆకట్టుకుంటుంది. ఒకవైపు సౌత్ సినిమాలతోనే కాదు మరొకవైపు హిందీ చిత్రాలలో కూడా నటిస్తూ అక్కడ కూడా భారీ పాపులారిటీ అందుకున్న నయనతార.. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొని తన సినీ కెరియర్లో తాను చేసిన తప్పులు, పొరపాట్ల గురించి చెబుతూ అందరిని ఆశ్చర్యపరిచింది. ఇంటర్వ్యూలో



భాగంగా తన కెరియర్ గురించి నయనతార మాట్లాడుతూ.. “నేను ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి 20 సంవత్సరాలు గడిచిపోయాయి. ఎంతోమంది స్టార్ హీరోలతో కలిసి నటించాను. ఆ హీరోలతో నటించేటప్పుడు చిన్న చిన్న పొరపాట్లు కూడా చేస్తూ వచ్చాను. అందులో నటన గురించి మెలకువలు నేర్చుకోవడంలో చేసిన పొరపాట్లు ఇప్పటికీ మర్చిపోలేకపోతున్నాను. ఒకసారి ఒక సినిమా షూటింగ్లో మోహన్ లాల్ గారితో నటించినప్పుడు నా పాత్రకు చాలా డైలాగులు ఉండేవి. అయితే ఆ డైలాగులకు తగ్గట్టుగా హావాభావాలను పలికించేందుకు తెగ కష్టపడి పోయాను. మోహన్ లాల్ గారేమో ఇంకా బాగా హావభావాలు పలకాలి అని నాతో చెప్పారు. ఇక పదేపదే చెబుతూ ఉంటే ఏం చేయాలో అర్థం కాక తెగ కంగారు పడిపోయాను. అయితే నా పరిస్థితిని అర్థం చేసుకున్న డైరెక్టర్ అక్కడికి వచ్చి ఈరోజుటికి చాలు.. రేపు ఏం చేయాలో రేపు ఆలోచిద్దాం అని చెప్పి నన్ను రక్షించారు. ఇంటికి వెళ్ళాక కూడా మరునాడు చేయబోయే సీన్ల కోసం రాత్రంతా రిహార్సల్స్ చేశాను. మరుసటి రోజు షూటింగ్ సెట్లో అందరూ అనుకున్నట్టుగానే నటించాను. షాట్ చాలా బాగా వచ్చింది. ఇక నన్ను అందరూ మెచ్చుకున్నారు. అయితే నిజానికి అప్పుడప్పుడు సినిమాలలో పొరపాట్లు జరుగుతూనే ఉంటాయి. అయితే ఆ విషయాలను నేను ఇప్పటికీ మర్చిపోలేకపోతున్నాను” అంటూ నయనతార తెలిపింది. అదే ఇంటర్వ్యూలో తన భర్త , పిల్లల గురించి కూడా చెప్పుకొచ్చింది నయనతార.




హైదరాబాద్: స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు రూ.వేల కోట్లు కేటాయిస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మూడు దశాబ్దాల క్రితం స్టార్టప్‌గా ప్రస్థానం ప్రారంభించిన గూగుల్.. నేడు ప్రపంచస్థాయిలో నిలిచిందని చెప్పారు. ఆ సంస్థను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. టీహబ్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన గూగుల్ ఫర్ స్టార్టప్ కేంద్రాన్ని ఐటీ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి సీఎం ప్రారంభించారు. హైదరాబాద్‌ను స్టార్టప్‌లకు కేంద్రంగా చేయనున్నట్లు రేవంత్ తెలిపారు. స్టార్టప్‌లు యూనికార్న్ స్థాయికి ఎదిగేలా ప్రణాళిక సిద్ధం చేసుకుని కృషి చేయాలని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సీఎం సూచించారు. దేశంలో తొలిసారిగా హైదరాబాద్‌లో గూగుల్ ఫర్ స్టార్టప్ కేంద్రాన్ని ఏర్పాటుచేయడం సంతోషంగా ఉందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఇప్పటికే ఎన్నో జీసీసీలు నగరంలో పెట్టుబడులు పెడుతున్నాయని.. స్టార్టప్‌లు సైతం ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకువెళ్లాలని సూచించారు.




హైదరాబాద్: పంచాయతీ ఎన్నికలకు సంబంధించి గురువారం జరిగే పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేశామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని తెలిపారు. మీడియాతో ఆమె మాట్లాడుతూ.. బందోబస్తు, శాంతిభద్రతల అంశాన్ని పోలీసులు పరిశీలిస్తున్నారని చెప్పారు. పోలింగ్ పూర్తికాగానే కౌంటింగ్ జరుగుతుందన్నారు. తొలి విడతలో 395, రెండో విడతలో 495 గ్రామాల్లో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయని చెప్పారు. ఇప్పటి వరకు తనిఖీల్లో రూ.8.2 కోట్లు సీజ్ చేశామని వివరించారు. 50వేల మంది సివిల్ పోలీసులు విధుల్లో ఉంటారని, 60 ప్లటూన్స్ బృందాలు బయటి నుంచి వచ్చాయని ఎస్ఈసీ తెలిపారు.

## నెలాఖరులోగా కార్పొరేషన్ ఛైర్మన్ పదవుల భర్తీ: మహేశ్ గౌడ్




హైదరాబాద్: నెలాఖరులోగా కార్పొరేషన్ ఛైర్మన్ల పదవులు భర్తీ చేస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైందని చెప్పారు. ఈ సమ్మిట్‌పై భారత రాష్ట్ర సమితి నేత హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు సరికావన్నారు. సమ్మిట్‌లో ఎన్నో అంతర్జాతీయ కంపెనీలు ఒప్పందాలు చేసుకున్నాయని తెలిపారు. కంపెనీల ప్రొఫైల్ చూడకుండా ఒప్పందాలు జరగవన్నారు. ఫ్యూచర్ సిటీ.. ప్రపంచస్థాయి పెట్టుబడిదారులను ఆకర్షిస్తోందని చెప్పారు. భారత రాష్ట్ర సమితి పదేళ్ల పాలన.. మా రెండేళ్ల పాలనపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

## ఎమ్మెల్యే మాధవరం వ్యాఖ్యలపై కవిత రియాక్షన్



హైదరాబాద్, డిసెంబర్ 10: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తనను వ్యక్తిగతంగా టార్గెట్ చేయటం ఆయన ఫ్రస్ట్రేషన్‌ను బయట పెడుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ఆయన చేసిన అన్ని ఆరోపణలకు ఆధారాలతో సహా వివరణ ఇస్తానన్నారు. కూకట్‌పల్లిలో 15 ఏళ్లుగా ఉన్న సమస్యలనే తాను చెప్పానని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడిన మాటాలకు ఫీలయ్యేది లేదని... ప్రజలు అన్నీ గమనిస్తున్నారని అన్నారు. జాగృతి జనం బాటలో భాగంగా ఐదు రోజుల పాటు హైదరాబాద్ జిల్లాలో పర్యటిస్తామని తెలిపారు. నేడు కంటోన్మెంట్‌లోని బోయినపల్లి గవర్నమెంట్ స్కూల్‌ను సందర్శించినట్లు చెప్పారు. మన ఊరు– మన బడి కార్యక్రమంలో భాగంగా ఈ స్కూల్‌ను బాగు చేశారని.. కానీ కాంపౌండ్ వాల్, సీసీ కెమెరాలు లేవన్నారు. వాటిని తాము ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ స్కూల్లోనే అంగన్ వాడీని కూడా కలిపారని... కానీ అంగన్‌వాడీలో హెల్పర్లు లేరన్నారు. జనం బాటలో భాగంగా విద్య, వైద్యం మీద ఫోకస్ పెట్టామని వెల్లడించారు. స్కూల్స్, హాస్పిటల్స్‌లో మౌలిక వసతులు ఎలా ఉన్నాయన్నది పరిశీలిస్తున్నామన్నారు. ఇండ్లు, ఇళ్ల పట్టాలను లేని వారి సమస్యలు కూడా తెలుసుకుంటున్నామన్నారు. తమ వరకు చేయగలిగేది ఒక సంస్థగా చేస్తామని స్పష్టం చేశారు. టాప్ టెన్ విద్యార్థులకు జాగృతి తరఫున స్కాలర్ షిప్‌లు ఇస్తామని ప్రకటించారు. ఏ జిల్లాకు వెళ్లినా ప్రజల నుంచి ఆదరణ, సమస్యలు పరిష్కరించే అవకాశం ఉంటోందన్నారు. ప్రజల సమస్యలను వీలైనంతగా పరిష్కరిస్తామని ప్రకటించారు. గత ప్రభుత్వంలో తనను నిజామాబాద్‌కే పరిమితం చేశారని.. అప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా ఏం జరుగుతుందో చూడలేదన్నారు. తెలంగాణ వచ్చాక ఏం జరిగింది... ఏం జరగలేదన్నది జనం బాట కార్యక్రమం ద్వారా తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. తాము చేయగలిగేవి చేస్తామని... మిగిలిన సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. మంచిని మంచి, చెడును చెడు అనే అంటామని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో ప్రతిపక్షం పట్టించుకోవటం లేదని... పాలక పక్షం అసలే పట్టించుకుంట లేదని.. అందుకే జాగృతి జనం గళమై పనిచేస్తోందని కవిత పేర్కొన్నారు.

## అందుకే ఎయిర్‌పోర్ట్‌కు బెదిరింపు కాల్స్: డీసీపీ రాజేశ

హైదరాబాద్, డిసెంబరు10 : శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు ఇటీవల వరసగా రెండుసార్లు బెదిరింపు కాల్స్ వచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో శంషాబాద్ డీసీపీ రాజేశ్ ఇవాళ (బుధవారం) ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడి ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఎయిర్ పోర్టుకు ఈ సంవత్సరం సుమారు 20కు పైగా ఫేక్ బెదిరింపు కాల్స్, మెసేజెస్ వచ్చాయని వివరించారు. ఫేక్ కాల్స్, మెయిల్స్‌పై దర్యాప్తు స్పీడప్ చేశామని పేర్కొన్నారు. సైబర్ క్రైమ్, సైబర్ సెక్యూరిటీ బ్యూరోలతో ఫేక్ కాల్స్, మెయిల్స్‌పై కో ఆర్డినేట్ చేసుకుంటున్నామని తెలిపారు. ఫేక్ కాల్స్ చేసిన వారిలో కొందరిని ఇప్పటికే అరెస్ట్ చేసి.. రిమాండ్ చేశామని వెల్లడించారు. పట్టుబడ్డ వారు వ్యక్తిగత కారణాలతోనే కాల్స్ చేశామని చెబుతున్నారని అన్నారు. ఫియర్, టీజింగ్ యాక్టివిటీతో కొందరు బెదిరింపు కాల్స్, మెయిల్స్ చేస్తున్నారని తెలిపారు.. ఇప్పటివరకు వచ్చిన కాల్స్ అన్ని దేశంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చాయని వివరించారు.. ఫేక్ కాల్స్, మెయిల్స్‌తో బెదిరింపులకు దిగిన వారిలో ఉగ్రవాద మూలాలు ఉన్నవారు లేరని స్పష్టం చేశారు శంషాబాద్ డీసీపీ రాజేశ్. బాంబు బెదిరింపులు వచ్చినప్పుడు ప్రయాణికులు ప్యానిక్ అవ్వాల్సిన అవసరం లేదని చెప్పుకొచ్చారు. ప్రజలకు అండగా పోలీసులు, భద్రతా బలగాలు ఉన్నాయని ధైర్యం చెప్పారు. శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌లో ప్రయాణికుల భద్రత కోసం పోలీస్ ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఫేక్ కాల్స్, మెయిల్స్‌పై దర్యాప్తు కోసం సైబర్ క్రైమ్ నుంచి స్పెషల్ టెక్నికల్ టీంను డిప్లయ్ చేశామని శంషాబాద్ డీసీపీ రాజేశ్ పేర్కొన్నారు.







## 'పూర్తి డేటాతో రండి'.. ఇండిగో సీఈవోకు డీజీసీఏ ఆదేశం

ఇండిగో విమాన కార్యకలాపాల్లో తీవ్ర అంతరాయాలతో ఇటీవల లక్షలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో సంస్థ సర్వీసుల్లో 10 శాతం కోత విధిస్తూ కేంద్రం ఇప్పటికే చర్యలు తీసుకుంది. ఈ క్రమంలోనే ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్ తమ ముందు హాజరుకావాలని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ తాజాగా ఆదేశాలు జారీ చేసింది. ఇటీవలి పరిణామాలకు సంబంధించిన పూర్తి డేటాతో ఈ నెల 11న డీజీసీఏ కార్యాలయానికి రావాలని ఓ ప్రకటనలో తెలిపింది. "ఇండిగో సీఈవో, సంబంధిత విభాగాల సీనియర్ అధికారులు గురువారం మధ్యాహ్నం 3 గంటలకు డీజీసీఏ కార్యాలయంలో నిర్వహించనున్న సమావేశానికి హాజరు కావాలి. ఇటీవలి అంతరాయాలకు సంబంధించిన సమగ్ర డేటా, అప్‌డేట్‌లు, పూర్తి నివేదికతో రావాలి" అని డీజీసీఏ ఆదేశించింది. విమాన సర్వీసుల పునరుద్ధరణబీ పైలట్లు, సిబ్బంది నియామకాల ప్రణాళికబీ పైలట్లు, క్యాబిన్ సిబ్బంది సంఖ్య వివరాలుబీ రద్దయిన విమానాల సంఖ్యబీ రీఫండ్‌లు తదితర పూర్తి సమాచారాన్ని అందజేయాలని సూచించింది. ఇండిగో వ్యవహారంపై దర్యాప్తు కోసం డీజీసీఏ ఇప్పటికే నలుగురు సభ్యులతో ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ఇటీవలి అంతరాయాలకు దారితీసిన కారణాలను గుర్తించడంతోపాటు భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా ఈ కమిటీ సిఫార్సులు చేయనుంది. కమిటీ నివేదిక ఆధారంగా తగు చర్యలు తీసుకుంటామని పౌర విమానయాన శాఖ ఇప్పటికే వెల్లడించింది. డీజీసీఏ ఇప్పటికే ఓసారి ఇండిగో సీఈవోకు షోకాజ్ నోటీసులు జారీ చేసి వివరణ తీసుకుంది. కచ్చితమైన కారణాలను గుర్తించేందుకు మరికొంత సమయం కావాలని విమానయాన సంస్థ కోరింది.




## పెళ్లి చేస్తామని నమ్మించి, ఇంటికి పిలిపించి.. యువకుడు దారుణ హత్య.!

సంగారెడ్డి జిల్లా, డిసెంబర్ 10: అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బీరంగూడలో దారుణం జరిగింది. తమ కూతురిని ప్రేమిస్తున్నాడనే కారణంతో ఓ యువకుణ్ని ఇంటికి పిలిపించి హతమార్చారు యువతి తల్లిదండ్రులు.

అసలేం జరిగిందంటే... జ్యోతి శ్రావణ్ సాయి అనే 20 ఏళ్ల యువకుడు.. మైసమ్మగూడలోని సెయింట్ పీటర్ కళాశాలలో బీటెక్ సెకండియర్ చదువుతున్నాడు. కుత్బుల్లాపూర్‌లో రూమ్ తీసుకుని అక్కడి నుంచి రోజూ కాలేజీకి వెళ్లివస్తున్నాడు. ఇతను.. బీరంగూడకు చెందిన శ్రీజ అనే 19 ఏళ్ల యువతితో కొన్నేళ్లుగా ప్రేమలో ఉన్నాడు. వీరిద్దరూ పదో తరగతి వరకూ కలిసి చదువుకోవడంతో సాన్నిహిత్యం ఏర్పడి.. ప్రేమకు దారితీసినట్టు తెలుస్తోంది. ఈ విషయం తెలిసి ఇరువురినీ పలుమార్లు హెచ్చరించారు శ్రీజ తల్లిదండ్రులు. అయినా వినిపించుకోకపోవడంతో ఆగ్రహించిన యువతి తల్లిదండ్రులు.. పెళ్లి చేస్తామని నమ్మించి, మాట్లాడుకుందామని చెప్పి సాయిని ఇంటికి పిలిపించారు. దీంతో ఆ యువకుడు శ్రీజ నివాసానికి వెళ్లాడు. అక్కడికి వెళ్లగానే.. ఒక్కసారిగా యువతి కుటుంబ సభ్యులు అతడిపై దాడికి పాల్పడి హతమార్చారు. విషయం తెలుసుకున్న అమీన్‌పూర్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.







## హైదరాబాద్‌లో లియోనెల్ మెస్సీ సందడి.. పూర్తి షెడ్యూల్ వివరాలివే..

ప్రపంచ ప్రఖ్యాత ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ భారత పర్యటనలో భాగంగా ఈ నెల 13న భాగ్యనగరానికి రానున్నాడు. 'ది గోట్ ఇండియా టూర్–2025'లో భాగంగా.. హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో జరిగే 7 వర్సెస్ 7 సెలబ్రిటీ ఫ్రెండ్లీ మ్యాచ్‌లో మెస్సీ పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డితో కలిసి మెస్సీ.. గోట్ కప్‌నకు అటెండ్ అవనున్నాడు. ఈ అర్జెంటీనా లెజెండ్ ఆటను ప్రత్యక్షంగా వీక్షించేందుకు అటు ఫుట్‌బాల్ అభిమానులు.. ఇటు సినీ, రాజకీయ, క్రీడా ప్రముఖులు ఎందరో చాలా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

**సీఎంతో కలిసి..** ఈనెల 13న తెల్లవారుజామున కోల్‌కతాకు చేరడంతో మెస్సీ భారత పర్యటన అధికారికంగా ప్రారంభమవుతుంది. అదే రోజు అక్కడ తన 70 అడుగుల విగ్రహాన్ని ఆవిష్కరించనున్నాడు. ఇప్పటివరకూ అతడి అతిఎత్తైన విగ్రహమిదే. భద్రతా కారణాల దృష్ట్యా ఈ కార్యక్రమాన్ని వర్చువల్‌గా నిర్వహించనున్నట్టు అక్కడి అధికారులు తెలిపారు. అదే రోజు సాయంత్రం.. ప్రత్యేక విమానం ద్వారా మెస్సీ హైదరాబాద్‌కు విచ్చేయనున్నాడు. అతడితో పాటు సుమారు 200 మందితో కూడిన టీమ్ కూడా భాగ్యనగరానికి రానుంది. ఉప్పల్ స్టేడియంలో మ్యాచ్ అనంతరం ఈ స్టార్ ఆటగాడు.. యంగ్ టాలెంటెడ్ ప్లేయర్లకు మాస్టర్ క్లాస్ ఇవ్వనున్నాడు. ఆ తర్వాత పెనాల్టీ షూటౌట్స్‌లో సందడి చేయనున్నాడు. చివర్లో మ్యూజికల్ కాన్సెర్ట్ జరగనుంది. ఆరోజు రాత్రి మెస్సీ.. నగరంలోనే బస చేయనున్నాడు. ఈ లెజెండరీ ప్లేయర్ నగర పర్యటన సందర్భంగా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేశారు అధికారులు. మెస్సీ, అతడి బృందం హైదరాబాద్‌కు చేరుకున్నప్పటి నుంచి స్వదేశానికి వెళ్లేంతవరకూ భారీ భద్రత కల్పించనున్నారు.

**ర్యాంప్ వాక్..** హైదరాబాద్ పర్యటన ముగిశాక.. మరుసటి రోజు ముంబయికి వెళ్లనున్నాడు మెస్సీ. అక్కడ సెలబ్రిటీలతో కలిసి ఓ ఫ్యాషన్ షోలో పాల్గొననున్నాడు. ఆ తర్వాత ఓ సామాజిక సేవ కోసం నిర్వహించే ఈవెంట్‌లో ర్యాంప్ వాక్ చేసి అలరించనున్నాడు. చివరగా.. ఢిల్లీ చేరుకుని ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ కానున్నాడు. అక్కడ ఏర్పాటుచేసిన కార్యక్రమాలు ముగిశాక.. అదే రోజు రాత్రి స్వదేశానికి బయలుదేరనున్నాడు. మెస్సీ.. భారత్‌కు రావడం ఇదే తొలిసారి కాదు. గతంలో 2011లో వెనిజువెలాతో జరిగిన ఓ ఫ్రెండ్లీ మ్యాచ్ కోసం కోల్‌కతాలో పర్యటించాడు.

## భారత్‌కు గూగుల్ 'ఏఐ ప్లస్'.. నెలవారీ ప్లాన్ ఎంతంటే?

ప్రముఖ టెక్ దిగ్గజం గూగుల్ 'ఏఐ ప్లస్' సేవలను భారత్‌లో అందుబాటులోకి తీసుకువచ్చింది. దీని నెలవారీ చందాను రూ.399గా ప్రకటించింది. కొత్తగా వచ్చిన చందాదారులు తొలి ఆరు నెలల పాటు ఈ సేవలను రూ.199కే ఆనందించొచ్చని తెలిపింది. ఈ ప్లాన్ ద్వారా గూగుల్ లేటెస్ట్ ఏఐ మోడళ్లను, ఫీచర్లను తక్కువ ధరకే పొందొచ్చని గూగుల్ ఓ ప్రకటనలో పేర్కొంది. ఏఐ ప్లస్ ప్లాన్ ద్వారా జెమినై యాప్‌లో జెమినై 3 ప్రో మోడల్‌ను యాక్సెస్ చేయొచ్చు. గూగుల్ ఇమేజ్ జనరేషన్, ఎడిటింగ్ మోడల్, నానో బనానా ప్రోనూ వాడుకోవచ్చు. వీడియో జనరేషన్‌తో పాటు ఫ్లో వంటి క్రియేటివ్ టూల్స్‌ను ఈ ప్లాన్ ద్వారా యాక్సెస్ చేయొచ్చని గూగుల్ తెలిపింది. జీమెయిల్, డాక్స్‌లో జెమినై సేవలు లభించనున్నాయి. రీసెర్చ్, అనాలసిస్ కోసం నోట్‌బుక్ ఎల్ఎం కూడా వాడుకోవచ్చు. దీంతో పాటు ఫొటోలు, డ్రైవ్, జీమెయిల్ కోసం 200 జీబీ స్టోరేజీని ఏఐ ప్లస్ ద్వారా ఉచితంగా పొందొచ్చని గూగుల్ తెలిపింది. ఏఐ ప్లస్‌ను తీసుకున్నవారు ఐదుగురు కుటుంబసభ్యులతో ఈ ప్లాన్‌ను పంచుకోవచ్చని పేర్కొంది.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com